
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
మంగళవారం 24 డిసెంబరు 2024



● చొరవ చూపని ఏపీసీపీడీసీఎల్ ● మూడు జిల్లాలు కలిపినా వెయ్యిలోపే కనెక్షన్లు ● ఆర్థిక ప్రయోజనాలను షార్టు వీడియోల ద్వారా ప్రదర్శించాలి ● కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు

సూర్యఘర్ స్కీమ్.. అమలులో

నిర్లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన (పీఎంఎస్‌జీవై) స్కీమ్ అమలులో మూడు జిల్లాలు వెనకబడిపోయాయి. ఈ పథకం అమలులోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా నామమాత్రంగానే రూఫ్‌టాప్ సోలార్ కనెక్షన్లను డిస్కమ్ సంస్థలు ఏర్పాటు చేయడం వాటి నిర్లక్ష్యాన్ని ఎండగడుతున్నాయి. జిల్లాలకు ఇచ్చిన లక్ష్యంలో కనీసం 10 శాతం కూడా అధిగమించలేని దుస్థితి కొనసాగుతున్నది. ప్రధానంగా ఈ పథకంపై ప్రజల్లో అవగాహన కొరవడింది. దీనివలన కలిగే ప్రయోజనాలను వివరించడంలో డిస్కమ్ అధికారులు విఫలమయ్యారు. కేవలం కరపత్రాల పంపిణీకే పరిమితం కావడం స్కీమ్ అమలుపై ప్రభావం చూపిస్తున్నది. దీంతో ప్రతీ ఇల్లు ఒక సౌర విద్యుత్ ఉత్పాదక యూనిట్ కావాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆశయం నీరుగారి పోతున్నది.

విద్యుత్ బిల్లులు పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు భారంగా మారుతున్నాయి. ట్రూఅప్ ఛార్జీల పేరుతో మోపుతున్న భారంతో కరెంటు బిల్లులు ప్రతీ నెలా షాకిస్తున్నాయి. దీనివలన ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొన్న కేంద్ర ప్రభుత్వం 2022 జూలై నెలలోనే పీఎం సూర్యఘర్ యోజన స్కీమ్‌ని అమలులోకి తీసుకొచ్చింది. వినియోగదారుడు ప్రతీ నెలా

పీఎం సూర్యఘర్ యోజన స్కీమ్ కింద ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ సోలార్



ఖర్చు చేసే విద్యుత్ యూనిట్ల ఆధారంగా రూఫ్‌టాప్ సోలార్ పవర్‌ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక కిలోవాట్ మొదలుకొని 3 కేడబ్ల్యూ వరకు ఏర్పాటు చేసుకొనే వెసులుబాటు ఉన్నది. రూ. 2 లక్షల విలువ చేసే సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం రూ. 72 వేల వరకు సబ్సిడీ ఇస్తున్నది. మిగతాది బ్యాంకుల నుంచి రుణం మంజూరు చేయిస్తున్నది.

ఏడాదిలో కనీసం 9 నెలల పాటు గరిష్ఠంగా విద్యుత్‌ని ఈ సోలార్‌ప్లాంట్ ఉత్పత్తి చేస్తుంది. గృహావసరానికి పోను మిగులు విద్యుత్‌ని డిస్కమ్ తీసుకొని సర్దుబాటు చేస్తుంది. ఒక విధంగా మిగులు విద్యుత్ వలన జరిగే బిల్లు ఆదాతో బ్యాంకు రుణం తీర్చవచ్చన్నది కేంద్ర ప్రభుత్వ వాదన. అయితే రిజిస్ట్రేషన్ మొదలుకొని వెండార్ ఎంపిక, బ్యాంకు రుణం పొందడంలో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. ఇది కూడా పథకం నెమ్మదించడానికి ఒక కారణంగా ఉన్నది. పీఎం సూర్యఘర్ వెబ్‌సైట్‌లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లకి ప్లాంట్ ఇన్‌స్టలేషన్ గణాంకాలకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. బాపట్ల జిల్లాలో 6319 రిజిస్ట్రేషన్లు జరిగితే అప్లికేషన్లు మాత్రం 1,735 మాత్రమే ప్రాసెస్ అయ్యాయి. వాటిల్లో ఇప్పటివరకు ఇన్‌స్టలేషన్ జరిగింది 231 మాత్రమే. ఇక సబ్సిడీ అయితే 140 కనెక్షన్లకే విడుదల చేశారు. గుంటూరు జిల్లాలో 16 వేల పైచిలుకు రిజిస్ట్రేషన్లు నమోదు జరిగితే, అప్లికేషన్లు 5 వేల నుంచి 6 వేల మధ్యనే ఉన్నాయి. వాటిల్లో 631 ప్లాంట్ల ఇన్‌స్టలేషన్ జరిగింది. సబ్సిడీ అయితే ఇందులో 364 మందికి విడుదలైంది. పల్నాడు జిల్లాలో 10318 రిజిస్ట్రేషన్లు జరుగగా 1281 అప్లికేషన్లు ప్రాసెసింగ్ జరిగింది. వాటిల్లో ఇన్‌స్టాల్ అయినవి 133 మాత్రమే. సబ్సిడీ అయితే కేవలం 56 మందికే వచ్చింది. ఈ గణాంకాలు పరిశీలిస్తే మూడు జిల్లాల పురోగతి చాలా పూర్‌గా ఉండటంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంత్రి పెమ్మసాని, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ దినకర్ సమీక్షలు ప్రారంభించారు. విద్యుత్ అధికారులు స్వయం సహాయక సంఘాలను సమన్వయం చేసుకొని ప్రజల వద్దకు వెళ్లి లాభాలను వివరించి పీఎం సూర్యఘర్ యోజన్ స్కీమ్‌ని పురోగతిలోకి తీసుకురావాలని ఆదేశించారు. మరో మూడు నెలల్లో మళ్లీ సమీక్ష ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రభుత్వ జీవోనూ...

పట్టించుకోవడం లేదు

ఈవీలపై వీడని 'పన్ను'పోటు!



- ఈనెల 11 నుంచే అమలులోకి రావాల్సిన 'ఏపీ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ'
- జీవో విడుదలై పక్షం కావస్తున్నా దక్కని పన్ను రాయితీ
- అధికారుల నిర్వాకంతో ప్రభుత్వ లక్ష్యానికి దెబ్బ
- పాలసీ అమలు చేయకపోవడంతో లబ్ధిదారులపై భారీ మోత

రాష్ట్రంలో విద్యుత్ వాహనాలపై ఇప్పటికీ పన్ను పోటు తప్పడం లేదు. విద్యుత్ వాహనాలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీలను అమలు చేయడంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం ప్రభుత్వ లక్ష్యాన్ని ఘోరంగా దెబ్బతీస్తోంది. దేవుడు వరమిచ్చినా పూజారి మాత్రం కనికరించ లేదన్న చందంగా రాష్ట్ర రవాణా శాఖ వినియోగదారులపైనా మోయలేని భారాన్ని వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహనాలపై కొత్త పాలసీని అమలులోకి తీసుకువచ్చి పక్షం రోజులు అవుతున్నా అది ఇంత వరకూ అమలులోకి రాకపోవడం పట్ల సర్వత్రా చర్చ సాగుతోంది.

గుంటూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డిసెం బరు 11న రాష్ట్ర ప్రభుత్వం 'ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0'ను విడుదల చేసింది. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం ఆ జీవోను విడు దల చేసింది. విద్యుత్ వాహనాల ఉత్పత్తిదారులు, విక్రేతలు, వినియోగదారులకు ఎన్నో రకాల రాయితీలు, ప్రోత్సాహకాలను ఆ జీవోలో ప్రభుత్వం ప్రకటించింది. 2024 డిసెంబరు 11 నుంచి 2029 డిసెంబరు 10వ తేదీ వరకూ అమలులో ఉండే ఆ జీవో తాలూకు ప్రయోజనాలన్నీ డిసెంబరు 11 నుంచే అమలులోకి వస్తాయని స్పష్టంగా జీవోలో పేర్కొన్నారు. అయితే ఆ జీవో ఇప్పటి వరకూ అమలుకు నోచుకోలేదు. జీవోను అమలులోకి తీసుకురావాల్సిన రవాణా శాఖ నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి స్పష్టతా రాలేదు.

ప్రతిసారీ ఇదే తంతు..?

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏపీ విద్యుత్ పాలసీని రూపొందించింది. దాని గడువు 2023తో ముగిసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం కొత్త పాలసీని రూపొందించకుండా పాత పాలసీనే పొడిగిస్తూ వచ్చింది. ఇలా గడువు ముగిసిన ప్రతి సారీ వినియోగదారులపై 12 శాతం రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీల భారం పడింది. దీంతో వినియోగదారులు భారీ మొత్తంలో నష్టపోవాల్సి వచ్చింది. జీవో గడువు ముగిసిన రెండు మూడు నెలల వరకూ జీవోని



పునరుద్ధరించక పోవడంతో ఆ సమయంలో కొన్న వినియోగదారులు 12 శాతం చొప్పున రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు భారీ మొత్తంలో చెల్లించాల్సి వచ్చింది. తాజాగా జూన్ 7న గడువు ముగిస్తే దాన్ని తిరిగి పునరుద్ధరించడానికి అక్టోబరు వరకూ ఆగాల్సి వచ్చింది. దీంతో ఆ 4 నెలల కాలంలో విద్యుత్ వాహనాలు కొన్నవారిపై 13 నుంచి 2 లక్షల వరకూ భారం పడింది. విద్యుత్ కార్లు కొన్నవారికి రూ. 4 లక్షల వరకూ భారం పడింది. కాగా అక్టోబరులో పొడిగించిన జీవో జూన్ 7 నుంచి డిసెంబరు 7వ తేదీ వరకూ మాత్రమే అమలులో ఉంది. అయితే కొత్తగా వాహనాలు కొనుగోలు చేయాలనుకునేవారు దసరా, దీపావళి పండుగ సమయాల్లోనే వాహనాలను కొంటారు. ఆ సమయంలో పన్ను రాయితీ లేకపోవడంతో వాహనాలు కొన్నవారంతా

(మిగతా 6వ పేజీలో)

దెబ్బతింటున్న ప్రభుత్వ లక్ష్యం..

విద్యుత్ వాహనాల వినియోగంలో రాష్ట్రం చాలా వెనుకంజలో ఉంది. 2024 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 1.78 కోట్ల విద్యుత్ వాహనాలు ఉండగా, అందులో విద్యుత్ వాహనాల వాటా నామమాత్రమే. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షా 30వేల విద్యుత్ వాహనాలు, 817 హైబ్రిడ్ విద్యుత్ వాహనాలు మాత్రమే వున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈవీ వాహనాలను ప్రోత్సహించడంపై దృష్టిపెట్టింది. 2018లో రూపొందించిన పాలసీ గడువు 2023తో పూర్తవగా, గత వైసీపీ ప్రభుత్వం ఆరు నెలలు చొప్పున రెండు సార్లు పొడిగించింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఏడాది అక్టోబరులో మరోమారు పొడిగించింది. ఈ గడువు కూడా డిసెంబరు 7తో పూర్తయింది. పొడిగింపుల పర్వానికి స్వస్తి చెబుతూ కూటమి ప్రభుత్వం తాజా గడువు ముగిసిన మూడు రోజుల్లోనే కొత్త పాలసీని ప్రకటించింది. ఆ పాలసీ ద్వారా 2029 నాటికి రాష్ట్రంలో 2 లక్షల విద్యుత్ టూ వీలర్స్, 10వేల త్రీ వీలర్స్, 20 వేల ఫోర్ వీలర్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకుంది. పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం చూపిన చొరవను ఏమాత్రం పట్టించుకోని రవాణా శాఖ అధికారులు దాని అమలుపై మీన మేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యం దెబ్బతింటోంది.

ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై
అభిప్రాయ సేకరణ
● ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా రాక
● 30న జిల్లా అధికారులతో సమావేశం
● కుల సంఘాల నుంచి వినతుల స్వీకరణ

6

సీఎం పర్యటనను
విజయవంతం చేయాలి
అధికారులకు సూచించిన కలెక్టర్ అరుణ్‌బాబు
పులిపాడులో హెలిప్యాడ్‌కు స్థల పరిశీలన

సేంద్రియ
ఆహారంతోనే ఆరోగ్యం
● డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

8

అవిశ్రాంత సాహితీ శ్రామికుడు..
లక్ష్మీనారాయణ
● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్

జనవరి నుంచి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం



- సీఎఫ్‌ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలకే నిధులు
- భవన నిర్మాణాలకు 15 రోజుల్లోనే అనుమతులు
- పురపాలక శాఖ మంత్రి నారాయణ

ఏఎన్‌యూలో జరిగిన మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీర్ల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న మంత్రి నారాయణ, వేదిక పైన కన్నబాబు, ఇతర అధికారులు



క్రిస్మస్ సందడి

- నూతనశోభ శోభ సంతరించుకున్న చర్చిలు
- ఆకర్షణీయ రంగులతో వెలుగొందుతున్న స్టార్లు
- కిటకిటలాడుతున్న దుకాణాలు

అర్హత లేకపోయినా పింఛన్ లబ్ధి పొందుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న వారిని గుర్తించే పనిని కూటమి ప్రభుత్వం చేపట్టింది. దీనిలో భాగంగా జిల్లాలో ఇప్పటికే ఓ సచివాలయ పరిధిలోని ఇళ్లను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి తనిఖీలు సైతం పూర్తి చేశారు. ఈ తనిఖీలలో భాగంగా పలు అంశాలు అధికారులు దృష్టికి వచ్చాయి. ఇంటి దగ్గర అందుబాటులో లేని వారి విషయంలో ఎటువంటి వైఖరి తీసుకోవాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకోనున్నారు.

పింఛన్ అనర్హుల

ఏరివేత

- ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద తనిఖీ పూర్తి
- అనర్హులకు త్వరలోనే నోటీసులు జారీ !



యద్దనపూడి మండలం పూనూరు గ్రామ సచివాలయ పరిధిలో పింఛన్ల తనిఖీ చేపడుతున్న యంత్రాంగం (ఫైల్ ఫోటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద యద్దనపూడి మండల పరిధిలోని పూనూరు–2 గ్రామ సచివాలయాన్ని ఎంపిక చేసి తనిఖీ పూర్తి చేశారు. ఇక్కడ మొత్తం 476 మంది పింఛన్లు అందుకుంటుండగా 447 మందికి సంబంధించి యంత్రాంగం పింఛన్ అందుకుంటున్న వారి వివరాలను నమోదు చేసి వెరిఫై అంకాన్ని పూర్తి చేసింది. పింఛన్ అందుకుంటున్న 29 మంది అందుబాటులో లేకపోవడంతో వాటిని హోల్డ్‌లో పెట్టి ప్రభుత్వ ఆదేశాల కోసం వేచి చూస్తున్నారు. ఇదిలా ఉంటే మొత్తం 447 తనిఖీల్లో భాగంగా అనర్హులు గా 18 మందిని గుర్తించినట్లు సమాచారం. వీరందరికి ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే నోటీసులు జారీ చేసే ప్రక్రియ చేపట్టనున్నారు. వారి వివరణ కూడా తీసుకున్న తర్వాతనే పింఛన్ తొలగింపుపై ఓ నిర్ణయానికి రానున్నట్లు సమాచారం

జిల్లాలో మొత్తం పింఛన్‌దారులు 2,28,615

జిల్లాలో మొత్తం పింఛన్ అందుకుంటున్న వారు 2,28,615 మంది ఉండగా, వీరిలో వితంతువులు 50,270, ఒంటరి మహిళలు 7,864, దివ్యాంగులు 25,892, మిగిలిన వారు ఇతరుల కింద లబ్ధి పొందుతూ ఉన్నారు. గడచిన ఐదేళ్లలో అర్హుల కు లబ్ధి చేకూర్చపోగా రాజకీయ పైరవీలతో ఇబ్బడి ముబ్బడిగా అనర్హులకు మేలు చేసినట్లు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం చేపట్టిన పరిశీలనలో వెల్లడైంది. గత ప్రభుత్వంలో అనర్హులు పింఛ న్ అందుకుంటున్నారంటూ దాదాపు 4,600 ఫిర్యాదులు ఐదేళ్ల వ్యవధిలో వచ్చాయి. వాటిపై విచారణ చేపట్టకపోగా యదేచ్ఛగా ప్రభుత్వ ఖజానాకు గండికొట్టే పనిని వైసీపీ ప్రభుత్వం చేపట్టింది. అప్పుడు వచ్చిన ఫిర్యాదులతో పాటు మొత్తం పింఛన్లనే ఓ సారి తనిఖీలు చేసి అనర్హులను ఏరివేసే ప్రక్రియకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది

గతంలోనే ప్రాథమికంగా ఓ అంచనా

ఇప్పుడు జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పూనూరు–2 సచివాలయ పరిధిలో దాదాపు 18 మందిని అనర్హులుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం. ఇదే నిష్పత్తిలో జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు 2,600 మంది వరకు అనర్హులుగా ఉండి పింఛన్ ఫలాలు అందుకుంటున్నట్లు అధికారులు ఓ అంచనాకు వచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే డీఆర్‌డీఏ పింఛన్ల తనిఖీని చేపట్టింది. దీనిలో భాగంగా అప్పట్లో దాదాపు 2,900 వరకు గుర్తించినట్లు సమాచారం. ఇప్పుడు పైలట్ ప్రాజెక్టు కింద గుర్తించిన అనర్హుల శాతంతో పోలిస్తే జిల్లా వ్యాప్తంగా ఇంచుమించు 2,600 మంది అనర్హులు పింఛన్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన సచివాలయ పరిధిలో గుర్తించిన అనర్హులతో పాటు ప్రభుత్వం గతంలో గుర్తించిన అనర్హులందరికీ త్వరలోనే నోటీసులు జారీ చేసే ప్రక్రియను యంత్రాంగం చేపట్టనుందని తెలుస్తోంది. గడచిన ప్రభుత్వంలో దాదాపు పదివేల మంది అర్హులు రాజకీయ పరమైన కారణాలతో పింఛన్లకు దూరంగా ఉండిపోయారు. వీరందరి దరఖాస్తులను పరిశీలించి నిబంధనల ప్రకారం వారందరికీ పింఛన్ ఫలాలు అందేలా చూడడానికి యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

రెండు విభాగాల మధ్య సమన్వయం కరువు

గతంలో పింఛన్లకు సంబంధించిన సమాచారమేదైనా డీఆర్‌డీఏ పీడీ లాగిన్‌కు వచ్చేవి. అలాంటిది ఇప్పుడు సెర్ప్ లాగిన్‌కు వెళ్లడంతో ఇరు విభాగాల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సచివాలయ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్‌కు పింఛన్‌కు సంబంధించిన దరఖాస్తు వస్తుంది. అక్కడ వెరిఫై అనంతరం ఎంపీడీవో లాగిన్‌కు, అక్కడ పరిశీలన ముగిసిన తర్వాత డీఆర్‌డీఏ పీడీ దగ్గరకు, అక్కడ నుంచి జిల్లా కలెక్టర్ ఆమోదంతో రాష్ట్రస్థాయికి పంపించే వారు. కానీ ఇప్పుడు సెర్ప్ సీఈవో లాగిన్‌కు వెళుతుండడంతో డీఆర్‌డీఏ పాత్ర నామమాత్రంగా మిగిలింది. పింఛన్లకు సంబంధించి వివరాల విషయంలో డీఆర్‌డీఏ సైతం సెర్ప్ మీద ఆధారపడాల్సి రావడం, రెండు విభాగాల సిబ్బంది మధ్య సఖ్యత లోపించడంతో కొంత గందరగోళానికి దారి తీస్తోంది.

ఏసుక్రీస్తు చూపిన బాటలో

పయనించాలి

● సెమీ క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లోక రక్షకుడైన ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరు పయనించాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ, క్రైస్తవ మైనార్టీ ఆర్థిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకల హై టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రైస్తవులకు క్రిస్మస్ పండుగ గొప్పదని ఈ పండుగను అందరు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రపంచ మానవాళికి ప్రేమ, దయ, అహింస మార్గాన్ని ఏసుక్రీస్తు చూపారన్నారు. వ్యక్తుల పట్ల ప్రేమ, దయ కలిగియుండాలని చెప్పారు. అహింసమార్గాన్ని ఆచరించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తుల ప్రదర్శనతో, కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమశాఖాధికారి షేక్.మహబూబ్ షరీఫ్, ఆర్డీవో పీ గ్లోరియా, పాస్టర్ రెవరెండ్, డాక్టర్ పీ వరబాబు, పాస్టర్ ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, అధికారులు, పాస్టర్లు

వీవీఐటీలో క్రమశిక్షణతో కూడిన విద్య


వీవీఐటీలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీవీఐటీ కళాశాల 17వ వార్షిక వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తాము కళాశాలలో గడిపిన ఆనంద క్షణాలను, మధురానుభూతులను పంచుకోవటమేగాక ప్రస్తుత విద్యార్థులకు విద్యానంతరం విషయాలు, ఉద్యోగ కల్పనకు కావాల్సిన అంశాలను వివరించారు. అనంతరం వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ వై.మల్లికార్జునరెడ్డి 2023-24 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ ఏడాది మెరుగైన ఉత్తీర్ణతా శాతాన్ని సాధించిన విభాగం కంప్యూటర్సైన్స్ అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్(సి.ఎస్.ఎమ్) అకడమిక్స్ టాపర్‌గా, విద్యాయేతర (క్రీడ, సాంస్కృతిక) అంశాలనందు ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విభాగం కంప్యూటర్ సైన్స్- ఐ.ఒ.టి అండ్ సైబర్ సెక్యూరిటీ విత్ బ్లాక్చైన్ టెక్నాలజీ (సి.ఐ.సి) రోలింగ్ షీల్డ్ లను దక్కించుకున్నాయి. ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ వీవీఐటీ సంపూర్ణ క్రమశిక్షణ - సంపూర్ణ విద్య నినాదముతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తుందని తెలిపారు. వేడుకలలో విభిన్న సంప్రదాయాల వస్త్రధారణతో విద్యార్థులు ప్రదర్శించిన ' సంప్రదాయ నడక' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కళాశాల అధ్యాపకులచే అవినీతికి దూరంగా ఉండాలన్న ఉన్నత లక్ష్యం దగ్గరలో ఉందా? సుదూరంలో ఉందా? అంటూ ప్రదర్శించిన 'పెండింగ్ ఫైల్' నాటకం విద్యార్థులను ఆలోచింపజేసేలా సాగింది. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎస్.కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయండి

- అధికారులకు సూచించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- పులిపాడులో హెలిప్యాడ్ స్థల పరిశీలన


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గురజాలటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనవరి 1వ తేదీన నిర్వహించనున్న మండలంలోని పులిపాడు పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు సూచించారు. సోమవారం పులిపాడు గ్రామంలో ఆయన పర్యటించి సీఎం చంద్రబాబు హెలిప్యాడ్ ల్యాడింగ్‌కు గ్రామంలోని టీడీడీ కల్యాణ మండపం సమీపంలోని అనువైన ప్రాంతాన్ని గుర్తించారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ అధికారులు కమిటీలుగా ఏర్పడి కార్యక్రమానికి విచ్చేసే ప్రజలకు మంచినీరు, స్నాక్స్ అందేలా చూడాలన్నారు. సీఎం చంద్రబాబు గ్రామానికి వచ్చేసరికి 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తవ్వాలన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్‌లను సీఎం చంద్రబాబు అందిస్తారని చెప్పారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌లపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్ట్ ఛైర్మన్ పులుకూరి కాంతారావు, జేసీ సూరజ్ గనోరే, జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్, గురజాల ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దార్ నగేష్, సీఐ భాస్కర్, ఎస్‌ఐ వినోద్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, మద్దినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనవరి నుంచి రాజధాని నిర్మాణ పనులు ప్రారంభం

- సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలకే నిధులు
- భవన నిర్మాణాలకు 15 రోజుల్లోనే అనుమతులు
- పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ

పెదకాకాని, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.62 వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామనీ, అందులో తొలివిడతగా వచ్చే సుమారు రూ.47 వేల కోట్లతో జనవరి నుంచి పనులు చేపట్టడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డైక్ మెన్ ఆడిటోరియంలో జరిగిన మున్సిపల్ కమిషనర్ల, ఇంజినీర్ల రాష్ట్ర వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేకపోవడం వలన అభివృద్ధి పనుల్లో జాప్యం ఏర్పడుతుందన్నారు. సీఎఫ్ఎంఎస్‌కి గత ప్రభుత్వం ప్రజల సొమ్ము సుమారు రూ.3200 కోట్లు తరలించిందన్నారు. వచ్చే ఏప్రిల్ 1 నుంచి సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలు తమ నిధులను తామే అభివృద్ధి పనులకు ఖర్చు చేసుకునేలా ముఖ్యమంత్రి అనుమతి ఇచ్చారని తెలిపారు. కమిషనర్లు రానున్న 3 ఏళ్లలో ప్రజలకు తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైన్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వర్షం నీటి నిర్వహణపై డీపీఆర్‌ను 20 రోజుల్లో అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. రాష్ట్రంలోని 28 లక్షల స్వయం సహాయక సభ్యుల ఆదాయాలను రానున్న కాలంలో రెట్టింపు చేయడానికి ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారని, అందుకోసమే గతంలో ఎన్నడూ లేనివిధంగా మెప్మా విభాగానికి ఐఏఎస్ అధికారిని నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలో జనవరి నుంచి సింగిల్ విండో ద్వారా 15 రోజుల్లోనే భవన అనుమతులు జారీ జరుగుతుందన్నారు. నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగితే ఇంజినీర్ లైసెన్స్ రద్దుతోపాటు చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామన్నారు. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు వేగంగా చేపట్టడం ద్వారా త్వరలోనే రాష్ట్ర మున్సిపాలిటీలను దేశంలోనే అత్యుత్తమ మునిసిపాలిటీలుగా తీర్చిదిద్దుకుందామన్నారు. పురపాలక శాఖ కార్యదర్శి కె.కన్నబాబు మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్లు, డ్రైయినేజీ, వీధి దీపాలు, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వర్క్‌షాప్‌లో మెప్మా ఎండీ, సీడీఎంఏ(ఇంచార్జి) ఎన్.తేజ్ భరత్, విశాఖపట్నం కమిషనర్ సంపత్ కుమార్, గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు, కాకినాడ కమిషనర్ భావన, ఈఎన్సీ డి.మరియన్న, రాష్ట్రంలోని కార్పొరేషన్ల, మున్సిపాలిటీల కమిషనర్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ జీవోనూ.. పట్టించుకోవడం లేదు

(5వ పేజీ తరువాయి)

ఆ భారాన్ని మోయాల్సి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో పండుగల సీజన్ నడుస్తోంది. క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా వాహన విక్రేతలు డిస్కౌంట్లు, రాయితీలు ప్రకటిస్తారు. అలాంటి సమయంలో వినియోగదారులు వాహనాలు కొనేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటి సమయంలో కూడా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందకపోవడంతో వినియోగదారులు తిరుగుముఖం పడుతున్నారు.

వినియోగదారులకూ రాయితీ..

తాజా పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం 12 శాతంగా వున్న రోడ్ ట్యాక్స్‌ను మినహాయించింది. దాంతో పాటు వాహనం ఖరీదులో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. తద్వారా లక్షకు రూ. 5వేలు చొప్పున వినియోగదారుడికి కలిసి వస్తుంది. లక్ష రూపాయల లోపు ఉన్న ఈ- ద్విచక్ర వాహనాలకు, రూ. 2 లక్షల లోపు ధర ఉన్న ఈ- 3 వీలర్స్‌కు, ఐదు లక్షలలోపు ధర ఉన్న సరుకు ఈ- రవాణా వాహనాలకు, రూ. 8 లక్షల లోపు ధర ఉన్న ఈ- ట్రాక్టర్లు, రూ. 2 కోట్ల లోపు ధర ఉన్న ఈ- బస్సులకు ఈ రాయితీ లభిస్తుంది. దాంతో పాటు స్క్రాప్ సర్టిఫికెట్ ఇస్తే వినియోగదారుడికి మరో 10 శాతం రాయితీ లభిస్తుంది. జీవో అమలులోకి రాకపోవడంతో వినియోగదారుడు ఆ రాయితీలన్నీ కోల్పోవాల్సి వస్తోంది. దీనిపై రవాణా శాఖ అధికారులను వివరణ కోరగా జీవో ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం వారు జారీ చేసిందని, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో జారీ చేసిన తరువాతే అది అమలులోకి వస్తుందని చెబుతున్నారు. జీవో గడువు ముగిసినరోజు అర్ధరాత్రి 12 గంటల నుంచే రోడ్ టాక్సును అమలులోకి తెస్తున్న రవాణా శాఖ, జీవో వచ్చి 15 రోజులు పూర్తయినా ఇప్పటికీ దాన్ని అమలు చేయకపోవడంపై వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై అభిప్రాయ సేకరణ

- ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా రాక
- 30న జిల్లా అధికారులతో సమావేశం
- కుల సంఘాల నుంచి వినతుల స్వీకరణ



గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ (షెడ్యూల్డ్ కులాల) ఉప వర్గీకరణపై వివిధ వర్గాల అభిప్రాయాన్ని సేకరించేందుకు ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ నెల 30న ఉదయం 10 గంటలకు జిల్లాకు చేరుకొని వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం అవుతారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్సీ సంఘాల నాయకుల నుంచి ఉప వర్గీకరణపై అభిప్రాయాలు, వినతిపత్రాలను స్వీకరిస్తారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం విజయవాడ వెళ్తారు. ఇక్కడ వినతిపత్రాలు ఇవ్వలేకపోయినా ప్రజలు ఈమెయిల్ ద్వారా కూడా పంపే అవకాశం కల్పించారు. అలానే విజయవాడలో ఉన్న కార్యాలయంలోనూ అందజేయవచ్చు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి. అలానే సుప్రీంకోర్టు కూడా ఎలాంటి నిలుపుదల ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ కులాల ఉప వర్గీకరణపై విచారణ జరిపి నివేదిక సమర్పించేందుకు రిటైర్డు ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాని నియమించింది. గత నెల 15న దీనికి సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడి కార్యాలయం మొదటి అంతస్తులో కమిషన్ ఆఫీసు కూడా ఏర్పాటు చేశారు. కమిషన్ ఇప్పటికే రాతపూర్వక వినతులను స్వీకరిస్తుంది. జనవరి 9వ తేదీ సాయంత్రం వరకు అర్జీలను వ్యక్తిగతంగా, రిజిష్టర్ పోస్టు ద్వారా పంపే అవకాశం కల్పించారు. అర్జీలను కమిషన్ మెయిల్ ఐడీ omcscsubclassification@gmail.com కూడా పంపవచ్చని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు.

మా స్థలాన్ని కబ్జా చేశారు


- వైసీపీ నేత ప్రేమ్ కుమార్ ఆగడాలపై మరో ఫిర్యాదు


గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెడలో టీడీపీ కండువా కప్పుకొని గ్రామీణ ప్రాంత రోడ్లలో వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేస్తూ రీల్స్ చేసి సోషల్ మీడియాలో అప్లోడ్ చేసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న కేసులో కర్నూలు పోలీసులు అరెస్టు చేసిన వైసీపీ నాయకుడు కొరిటిపాటి ప్రేమ కుమార్ ఆగడాలపై సోమవారం ఎస్పీకి మరో ఫిర్యాదు అందింది. చిన్ని ట్రావెల్స్ నిర్వాహకుడు ఖరీదు నాగ కుమార్ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2018 నుంచి ఏఈఎల్‌సీ అధ్యక్షుడు బెనర్జీ, ట్రెజరర్ రాజరత్నం నుంచి రమేష్ హాస్పటల్ పక్కన ఉన్న ఫైయర్ హాల్ కాంపౌండ్‌లో 1450 చదరపు గజాల స్థలాన్ని తన భార్య సుమ పేరుతో లీజుకు తీసుకొని అందులో చిన్ని ట్రావెల్స్ కార్యాలయాన్ని, అదేవిధంగా ఆయా వాహనాలకు పార్కింగ్ గా ఉపయోగించుకుంటున్నామని నాగ కుమార్ పేర్కొన్నారు. అయితే కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని తనను, తన భార్యను బెదిరించి దౌర్జన్యంగా స్థలాన్ని కబ్జా చేసి అందులో రేకుల షెడ్డు వేశాడన్నారు. అందులో ప్రేమ్ కుమార్‌తోపాటు ఆయన అనుచరులు గంజాయి, మద్యం, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో తమను తీవ్రంగా ఇబ్బందులు పెట్టారనీ, ఎన్నిసార్లు జిల్లా ఎస్పీ కార్యాలయంలో, నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

గిరిజనుల అభివృద్ధే కూటమి లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారు నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో జగన్‌రెడ్డి గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు, విద్య, వైద్యం వంటి కనీస సదుపాయాలు కల్పించలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మద్యం ఆదాయం పేరిట ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టి రుణాలు తెచ్చినా అభివృద్ధి మాత్రం శూన్యం అన్నారు. వెనకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.350 కోట్లు ఇస్తే, గత వైసీపీ ప్రభుత్వం నిధులను దారి మళ్లించిందన్నారు. దీంతో వెనకబడిన జిల్లాలు మరింత వెనకబడ్డాయన్నారు. గిరిజన ప్రాంతాలను కూటమి ప్రభుత్వం పర్యాటకంగా అభివృద్ధి చేయటం ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనుందన్నారు. రాష్ట్రంలో ఏడు ఐటీడీఏల పరిధిలో 9031 గిరిజన గ్రామాలు ఉండగా వాటిలో 2162 పల్లెలకు ఇప్పటికీ రహదారి సదుపాయం లేదన్నారు. కూటమి ప్రభుత్వం గిరి పుత్రుల వైద్య సదుపాయం కోసం ఏజెన్సీలలో డోలి మోతకు స్వస్తి పలకడానికి కరడవలసలో కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కారు ఢీకొని అన్నదమ్ములు మృతి


గురవయ్య(ఫైల్)


భీమరాజు (ఫైల్)

వినుకొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో పసుపులేరు బ్రిడ్జి వద్ద ప్రతాపుల గురవయ్య (55) మృతి చెందగా, ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న గురవయ్య తమ్ముడు భీమరాజు(52) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురవయ్య, భీమరాజు అన్నదమ్ములు. ఇద్దరూ వినుకొండ మున్సిపాలీటీలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో పసుపులేరు బ్రిడ్జి వద్ద వాగు వెంబడి ఉన్న జీవాలను(పందులు) చూసుకునేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి ద్విచక్రవాహనంపై వినుకొండకు బయలుదేరుతుండగా, వేగంగా వచ్చిన కారు బ్రిడ్జి వద్ద వీరిని ఢీకొట్టింది. ప్రతాపుల గురవయ్య అక్కడికక్కడే మృతి చెందగా, తమ్ముడు భీమరాజు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గురవయ్యకు భార్య సాంబ, నలుగురు కుమార్తెలు ఉండగా ముగ్గురికి వివాహం జరిపించారు. భీమరాజుకు ఐదుగురు సంతానంలో నలుగురు కుమారులు, ఒక కుమార్తె కలరు. సంతానంలో అందరికీ వివాహం జరిపించారు. మృతి చెందారనే సమాచారం మేరకు బంధువులు పెద్ద ఎత్తున వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. కారు యజమాని మద్యం తాగిన కారణంగా ప్రమాదం జరిగిందని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు. న్యాయం జరిగేంత వరకు మృతదేహాలను తరలించబోమని కొంతసేపు స్తూపం సెంటర్‌లో భీష్మించుకొని కూర్చొన్నారు. పెద్దల సమక్షంలో రాజీ కుదరడంతో బంధువులు శాంతించి మృతదేహాలను తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శోభనబాబు తెలిపారు.

అన్నదాతంటే.. అలుసా

- జాతీయ రైతు దినోత్సవం మనోళ్ళకి గుర్తు లేదు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

దేశానికి రైతే వెన్నెముక.. అంటూ రాజకీయ పార్టీల నేతలు ఊదర గొడతారు. అయితే జాతీయ రైతు దినోత్సవాన్ని వారు విస్మరించడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి ఏటా డిసెంబరు 23ను రైతుల దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జాతీయ, ప్రపంచ దినోత్సవాలను నిర్వహించే నేతలకు రైతు దినోత్సవం గుర్తుకు రాకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా జాతీయ రైతు దినోత్సవాన్ని నేతలు నిర్వహించిన దాఖలాలు లేవంటే వారి పట్ల వారికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో వినూత్నంగా పంటలు పండిస్తున్న రైతులను గుర్తించి రైతు దినోత్సవం సందర్భంగా వారిని సత్కరిస్తే ఆదర్శ రైతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ దిశగా ప్రోత్సాహం లేకపోవడం పట్ల రైతు వర్గం అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. ఒకరిద్దరు నాయకులు మాత్రం రైతులకు శుభాకాంక్షలు తెలుపడం గమనార్హం.

ఎస్‌వో-2 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తూ 55 సంవత్సరాలు వయసు ఉండి, పీజీడీసీఏ, డీసీఏ డిప్లొమా కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన వారు ఈనెల 31లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం smgrashikshaguntur.blogspot.com అనే వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఎల్‌టీ, ఎఫ్ఎన్‌వో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గుంటూరు మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గ్రేడ్-2 ల్యాబ్ టెక్నీషియన్లు, ఎఫ్ఎన్‌వోలుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు 5, ఎఫ్ఎన్‌వో పోస్టులు 14 భర్తీ చేస్తున్నట్లు ఆమె వివరించారు. అర్హులైన, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను జనవరి ఏడో తేదీలోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలకు ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని డీఎంహెచ్‌వో సూచించారు.

టీబీ కార్యాలయంలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

గుంటూరు మెడికల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా జాతీయ క్షయ నిర్మూలన పథకంలో జిల్లా క్షయ నియంత్రణ విభాగంలో ఏడాది పాటు కాంట్రాక్ట్ విధానంలో పని చేసేందుకు పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాట్స్ ప్లస్ టీబీ-హెచ్ఐవీ సూపర్‌వైజర్ (ఒక పోస్టు), డ్రగ్ రెసిస్టెన్స్ సెంటర్ టీబీ స్టాటిస్టిక్స్ అసిస్టెంట్ (ఒక పోస్టు), ఫుల్‌టైమ్ అకౌంటెంట్ (ఒక పోస్టు), టీబీహెచ్‌వీ (రెండు పోస్టులు), జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ (ఒక పోస్టు)కు సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను జనవరి ఐదులోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ పోస్టులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిని సంప్రదించాలని సూచించారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు(విద్య),డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే సెకండరీగ్రేడ్, స్కూల్ అసిస్టెంట్స్ పదోన్నతుల కోసం ఈనెల 24న సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు ఉదయం 11 గంటలకు డీఈవో కార్యాలయంలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని సూచించారు. సీనియార్టీ జాబితాను deognt.blogspot.com అనే వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు తెలిపారు.

బజరంగ్ జూట్ మిల్లులో అక్రమాలపై పోరాడుతున్నందుకు హత్యాయత్నం

- ఎస్పీకి పిల్లి బాబురావు ఫిర్యాదు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బజరంగ్ జూట్ మిల్లుకు సంబంధించిన స్థలాలను వైసీపీ నాయకులు అంబటి రాంబాబు, ఆయన సోదరుడు మురళి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయంపై తాను పోరాడుతున్నందుకు తనపై హత్యాయత్నం జరిగిందని కార్మిక సంఘ నాయకుడు పిల్లి బాబురావు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. బజరంగ్ జూట్ మిల్లు లాభాల్లో 40 శాతం కార్మికులకు వాటా రావాల్సి ఉందన్నారు. దానికి సంబంధించి కోట్లాది రూపాయలు కార్మికులకు రావాల్సి ఉండగా, మిల్లులో 60 శాతం వాటాదారుగా ఉన్న లునాని ఆ మొత్తం చెల్లించలేదన్నారు. అంతేగాక చట్ట నిబంధనల ప్రకారం బజరంగ్ జూట్ మిల్ ఆస్తులను విక్రయించడానికి గాని, కొనుగోలు చేయడానికి కానీ ఎవరికీ హక్కు లేదన్నారు. అయినప్పటికీ 2009లో రెండున్నర ఎకరాలు, అలాగే 2015లో ఐదున్నర ఎకరాలను అంబటి సోదరులు అక్రమంగా నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. దీనిపై తాను హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసి పోరాటం చేస్తున్న నేపథ్యంలో తనను కేసు ఉపసంహరించుకోవాలని వైసీపీ నేతలు అంబటి బ్రదర్స్‌తోపాటు కొందరు టీడీపీ నాయకులు కూడా ఒత్తిడి తెచ్చారన్నారు. ఆ కేసు విషయంలో తాను వారి మాట వినకపోవడంతో ఈనెల మూడున తాను ఓవర్ బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళుతుండగా ఆటోలో వచ్చిన గుర్తుతెలియని దుండగులు తనను పైనుంచి కిందకు పడేయాలన్న ఉద్దేశంతో కాళ్లతో తన్నారన్నారు. దీంతో ఫుట్‌పాత్‌పై పడిపోవడంతో చేతి భుజం వద్ద విరిగిందన్నారు. బజరంగ్ జూట్ మిల్ అక్రమాలపైనా, హత్యాయత్నంపైనా కేసులు నమోదు చేయాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 576.20 అడుగులు ఉంది. ఇది 272.17 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8144 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6022, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30114 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 46,980 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి 21,637 క్యూసెక్కుల నీరు వస్తుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98,107,118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

60,866 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 65,687 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 60,866 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 49,236 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14500	334	8000	14500
నెంబరు. 5	8500	12500	నెంబరు.5	8500	13500
273	11200	11500	273	11000	11000
341	8000	14800	341	8000	14100
4884	--	--	4884	10700	10700
సూపర్ 10	10000	10000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	16000	తేజ	8000	16500
బ్యాడిగి	8000	13500	బ్యాడిగి	8400	12000
దేవనూరు డీలక్స్	9000	15000	దేవనూరు డీలక్స్	8500	15500
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4500	10000

ప్రజా సమస్యల పరిష్కారవేదికకు బస్సు సౌకర్యం కల్పించాలి : సీపీఐ

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కారవేదికకు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ సీనియర్ నాయకుడు జేబీ శ్రీధర్ డిమాండ్ చేశారు. శృంగారపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి పల్లె నుంచి పట్టణానికి వచ్చే అర్జీదారులకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, అద్దంకి నియోజకవర్గ కార్యదర్శి తుమ్మల పూర్ణచంద్రశేఖర్, బల్లికురవ మండల కార్యదర్శి వెంకటఅప్పయ్య, వల్లెపు నరసింహం, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శత వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి శత వార్షికోత్సవంలోకి అడుగిడుతున్న సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు వాడవాడలా పార్టీ పతాకాలను ఆవిష్కరించి విజయవంతం చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశ సంపదను అదాని, అంబానిలకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బండారు శ్రీనివాసరావు, గొట్టిముక్కల బాలాజీ, చేతివృత్తిదారుల సమాఖ్య సభ్యులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు అల్పాహారం పంపిణీ

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు సోమవారం అల్పాహారం అందజేశారు. దూరప్రాంతాలు నుంచి ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చేవారికి రెండు సంవత్సరాలుగా దాతల సహకారంతో ఆహారం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతివారం 300 మందికి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం జిల్లాలో ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో డీవీ రమణబాబు, బూర్లె రామసుబ్బారావు, ఇ.పోలీసురావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి బియ్యం, దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని లంకకాల్వకట్ట సమీపంలో నివాసం ఉంటున్న నిరుపేద ముస్లిం వృద్ధురాలికి శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బియ్యం, రగ్గులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరాజు, చార్టెడ్ అకౌంటెంట్ చాపల సుబ్రహ్మణ్యం, డాక్టర్ హనుమంతరావునాయుడు, కె.వీరాంజనేయులు, డి.నరేష్, నక్కా రమేష్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు...

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక ఆధ్వర్యంలో అప్పికట్ల ఎస్సీ కాలనీలో సోమవారం ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. 18 సంవత్సరాలుగా పేదలకు ఈ విధంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సాల్వేషన్ ఆర్మీ పాస్టర్ క్రీస్తురాజు, గృహసమితి మహిళలు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చెరుకుపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని మండలంలోని కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజాక్షి కోరారు. గ్రామంలోని డాక్టసే సంస్థ అధినేత తుమ్మల రామకృష్ణ మధ్యాహ్నభోజన పథకంలో భాగంగా విద్యార్థులు భోజనం చేసేందుకు 250 భోజన ప్లేట్లను అందించగా వాటిని సోమవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ ధనుంజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్చి ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

బాపట్లడిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండుబొట్లపాలెం ఎస్సీకాలనీలో చర్చి ప్రహరి నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సహాయ సహకారాలతో నిర్మిస్తున్న పనులకు టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కొండలు, బూత్ ఇన్‌చార్జి మార్పుప్రతాప్, ఫీల్డ్ అసిస్టెంట్ వాసు, గ్రామపెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

పోరుబాట జయప్రదం చేయాలి : మేరుగ

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈనెల 27వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున తెలిపారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో సోమవారం పార్టీశ్రేణులతో కలిసి ఆయన బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పర్చూరు సమన్వయకర్త యడం బాలాజి, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, యువజనవిభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, విద్యార్థి విభాగం అధ్యక్షుడు యల్లావుల సోహిత్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య, మహిళా నాయకురాలు గొర్రెముచ్చు పుష్పరాజ్యం, ఎంపీపీ చినపోతుల హరిబాబు తదితరులు ఉన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాలు

కర్లపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రసాయన ఉత్పత్తులను తగ్గించి కాషాయాలతో ప్రకృతి కూరగాయాలను, ఆకు కూరలను పండిస్తున్నామని ఐసీఆర్‌పీ సిబ్బంది శ్రీకాంత్ అన్నారు. కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఐసీఆర్‌పీ ఆధ్వర్యంలో ఆర్గానిక్ ఉత్పత్తిలైన కూరగాయలను సోమవారం విక్రయించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సత్యనారాయణ, ఐసీఆర్‌పీ నందిని ఉన్నారు.

హౌస్ హోల్డ్ సర్వే నెలాఖరుకు పూర్తి చేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



కలెక్టర్‌కు సమస్యలు తెలుపుతున్న ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ రాజసుందరబాబు తదితరులు

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహనిర్మాణ శాఖ హౌస్ హోల్డ్ సర్వేను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తి చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీలు స్వీకరించి వారి సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకొని ఆయాశాఖల అధికారులకు అందించి తక్షణ పరిష్కారం చూపించాలని చెప్పారు. రీఓపెన్ అర్జీలకు పరిష్కారం చూపుతున్నప్పటికి ఫీడ్‌బ్యాక్ బాగాలేదని అన్నారు. ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారానికి ర్యాంకింగ్ ఇస్తుందన్నారు. కావున వాటిని పరిష్కరించి స్క్రీన్‌పై అప్‌లోడ్ చేయాలన్నారు. కొంతమంది అధికారులు అర్జీలు పరిష్కరించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అలసత్వం చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో అర్జీలను పూర్తి స్థాయిలో విశ్లేషించుకొని పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ పద్మావతి, డ్వామా పీడీ విజయలక్ష్మి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, స్త్రీశిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి కె.ఉమా, గృహనిర్మాణశాఖ పీడీ వై.వెంకటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి జె.రాజాదెబోరా తదితరులు పాల్గొన్నారు.

బోట్‌లు పెట్టుకునే స్థలాన్ని ఖాళీ చేయిస్తున్నారని ఫిర్యాదు

బాపట్ల రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అడవిపంచాయతీ రామచంద్రపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు తమ బోట్‌లను పెట్టుకునే స్థలాన్ని కొంతమంది ఆక్రమించి తొలిగించాలని చూస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో మత్స్యకారులు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

రిజర్వేషన్‌లు సక్రమంగా అమలు కాలేదు : గోళ్లమూడి

దేశంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన రిజర్వేషన్లు సక్రమంగా అమలు కాలేదని ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధిపత్య కులాలతో సమానంగా ఎదగలేదని, పెరిగిన జనాభా నిష్పత్తిలో రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు సమస్యలపైన పలు ప్రజాసంఘాల నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ రైట్స్ ప్రొటక్షన్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ జడా రవీంద్రబాబు, గురజా రాజారావు, ఎ.శ్రీనివాసరావుయాదవ్, కురేటి మాణిక్యారావు, పుట్టా రవీంద్ర, జానకిరాము, జి.ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారవేదిక సద్వినియోగం చేసుకోవాలి : ఆర్డీవో

రేపల్లె, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందాయి. చెరుకుపల్లి మండలం గూడవల్లి గ్రామానికి చెందిన గంటా శివనాగేశ్వరావు గ్రామంలో తనకు 2.80 సెంట్ల భూమి కలదని, ఆ భూమి మోటూరు ధనలక్ష్మి పేరున ఆన్‌లైన్ జరిగిందని, ధనలక్ష్మికి చెందిన పాస్ పుస్తకాన్ని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. మండలంలోని బేతపూడి గ్రామానికి చెందిన కర్రా అర్జున్‌రావు ఇంటి వద్ద కాల్వలలో పూడుకుపోయిన మురుగును తొలగించాలని కోరారు. వీటిపై పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదం



కేక్ కట్ చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు

రేపల్లె, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదం చేస్తాయని రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం కేక్‌కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషిలోని మృగత్వాన్ని పారద్రోలి మానవత్వాన్ని మేలుకొలిపిన మహనీయుడు యేసుక్రీస్తు అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు జీ.ప్రశాంత్‌కుమార్, దారం సాంబశివరావు, దోవ రమేష్‌రాంజీ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ముగిసిన శిక్షణ తరగతులు

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో యు నెక్స్ట్ ఎంప్లాయిబిలిటి ట్రైనింగ్ ప్రోగ్రామ్ సోమవారంతో ముగిసింది. ఇంజనీరింగ్ కళాశాలలోని సెకండ్‌షిఫ్ట్ పాలిటెక్నిక్ కాలేజిలో నెలరోజులుగా బెంగుళూరుకు చెందిన ఉన్నతి ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. డిబేట్, పబ్లిక్ స్పీకింగ్, ఇంటర్వ్యూలు, సైకాలజి, పర్సనాలటి డెవలప్‌మెంట్ గురించి సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్, చేంజ్‌మేకర్ కె.రామకృష్ణారెడ్డి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్‌నజీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, ఇన్‌చార్జి లక్ష్మి, వీరేంద్రనాద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల రైతు దంపతులకు పుడమి పుత్ర పురస్కారం

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పటేల్‌నగర్‌కు చెందిన లేళ్ళ దేవిక, వెంకటరమణారావులకు పుడమిపుత్ర పురస్కారం లభించింది. ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లో గాంధీగ్లోబల్ ఫ్యామిలీ, గాంధీజ్ఞాన్‌ప్రతిష్టాన్‌వారు సోమవారం నిర్వహించిన సమగ్ర వ్యవసాయ విజ్ఞాన సదస్సులో వీరికి చైర్మన్ డాక్టర్ గున్న రాజేంద్రరెడ్డి చేతులమీదగా పురస్కారం అందజేశారు. పట్టణంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా 360 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నందుకు ఆయనకు ఈ పురస్కారం లభించింది. ఈసందర్భంగా వారిని పలువురు అభినందించారు.

పేరలి పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరావు



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎంపీడీవో తదితరులు

కర్లపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలి పంచాయతీ కార్యదర్శిగా డి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించినట్టు ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావును ఎంపీడీవో, సిబ్బంది అభినందించారు. అనంతరం ఎంపీడీవో పంచాయతీలో రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న బాబురావు, విద్యార్థులు

బాపట్లరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం కంకటపాలెం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కదిరి బాబురావు, వ్యవసాయ కళాశాల సిపిఎస్‌పురం విద్యార్థులు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఉషా, డాక్టర్ ఆర్.బాలమురళీధర్, రైతులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ : వ్యక్తికి తీవ్రగాయాలు

బాపట్లరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంటుంది. వెదుళ్ళపల్లి ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాల సమీపంలోని హైవేరోడ్డుపై కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనటంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి కాలికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఎం.అనసూయ

చెరుకుపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : కిశోరి బాలికలకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, జీవనైపుణ్యాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని కమిటీ సభ్యులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన కిషోరి వికాసంపై శిక్షణా కార్యక్రమంలో సీడీపీవో ఎం.అనసూయ మాట్లాడుతూ కిశోరివికాసం కార్యక్రమం ద్వారా బాల్య వివాహాలు, బాలకార్మికులను లేకుండా చేయాలన్నారు. పాఠశాలకు దూరంగా ఉన్న బాలికలను గ్రూపుగా చేసే బాధ్యత మహిళాపోలీస్ వెల్ఫేర్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వార్డు సెక్రటరీలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు, సెక్రటరీలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

అబాకస్ చాంపియన్‌కు సత్కారం



హార్దీని సత్కరిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు

కొల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అబాకస్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన విద్యార్థిని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు సత్కరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన అబాకస్ పోటీల్లో కొల్లూరుకు చెందిన అత్తోట హార్దీ చాంపియన్ ట్రోఫీ సాధించినందుకు తహసీల్దార్ చేతుల మీదుగా సత్కరించారు. రాష్ట్రానికి గుర్తింపు తెచ్చిన విద్యార్థిని అభినందించి మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆళ్లమూడి ప్రభాకరరావు, అలపర్తి బాబు, కొమ్మూరి మధు, పులివర్తి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీ చించివేత



చింపివేసిన ఫ్లెక్సీని పరిశీలిస్తున్న వెంకటశివన్నారాయణ, పోలీసులు

కర్లపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలి గ్రామంలో ఏర్పాటు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీనటుడు చిరంజీవి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. చించిన ఫ్లెక్సీని జనసేన పార్టీ జిల్లా సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ సోమవారం పరిశీలించారు. కర్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫ్లెక్సీని చించిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కర్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ సదస్సులో మూడు అర్జీలు

కర్లపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలిలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 8 అర్జీలు భూ సమస్యలపై వచ్చాయని తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల వేదికలో రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భూ సమస్యపై ఒక అర్జీ వచ్చినట్లు మండల తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చెరుకుపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను ఎంఏడీటీ టి.బాలాజీ గంగాధర్ తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తప్పకుండా బిల్లులను తీసుకోవాలని, ఎంఆర్‌పీ ధరలకు మించి అమ్మిన యెడల ఫిర్యాదు చేయాలని రైతులను కోరారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

● వేమూరులో 104, జంపనిలో 100 సంవత్సరాల పండుగకు సిద్ధమైన క్రీస్తు దేవాలయాలు



70 ఏళ్ల పండుగకు సిద్ధమైన పెరవలిలోని లూథరన్ చర్చి



104 సంవత్సరాల నాటి వేమూరులోని రక్షణ సైన్యం ప్రార్థన మందిరం



నూరేళ్ల పండుగకు సిద్ధమైన తెలుగు బాప్టిస్టు చర్చి

వేమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగ వేడుకలను మండల పరిధి గ్రామాల్లోని క్రైస్తవ సంఘాలు చర్చిలను ముస్తాబు చేశారు. ప్రతి చర్చికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేమూరులో 1920 సంవత్సరంలో నిర్మించిన రక్షణ సైన్యం ప్రార్థనా మందిరంలో 104 సంవత్సరాల పండుగను 1924 లో బ్రిటీష్ వారి సహకారంతో నన్నెపాగ జార్జి పర్యవేక్షణ లో నిర్మించిన తెలుగు బాప్టిస్టు చర్చిలో 100 సంవత్సరాల పండుగ పెరవలి గ్రామంలో 1955లో నిర్మించిన లూథరన్ చర్చిలో 70 ఏళ్ల పండుగను జరుపుకునేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది ప్రముఖులైన పాస్టర్స్‌ను సన్మానించడంతో పాటు సంఘ పెద్దలను సన్మానించనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దానధర్మాలు, అన్నదాన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసేందుకు ఆయా సంఘాల పెద్దల పర్యవేక్షణ జరుగుతోంది.

అర్జీలు పునరావృతం కాకుండా బాధితులకు న్యాయం చేయాలి

● ఎస్పీ తుషార్ డూడి



అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అర్జీలు పునరావృతం కాకుండా బాధితులకు సంతృప్తికర రీతిలో న్యాయం చేయాలని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 46 మంది అర్జీల ద్వారా తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. సమస్యలు తెలుసుకున్న ఎస్పీ అర్జీలను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్జీలపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి నివేదించాలన్నారు. కుటుంబ కలహాలు, భూ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, ఇతర పలు కారణాలతో అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, పీజీఆర్ఎస్ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన ఇరువురు అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సలు పొందారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి ఆర్థిక సహాయం కోరడంతో ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫారసు చేశారు. సీఎంఆర్ఎఫ్ కార్యాలయం నుంచి అందిన చెక్కులను అన్నపరెడ్డి అభిషేక్‌కు రూ.96,274, బవిరిశెట్టి కోటేశ్వరరావుకు రూ.54,450 అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కొల్లూరు నాగ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఉద్యోగావకాశాలు వినియోగించుకోవాలి

● జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్

వేమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్ మేళాల ద్వారా ఉద్యోగావకాశాలు వినియోగించుకోవాలని బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ప్రణయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రైవేట్ కంపెనీలకు జాబ్‌మేళా విధానాన్ని కొనసాగించాలని తద్వారా నిరుద్యోగులకు భృతి కల్పించాలని ఆదేశించడంతో పలు కంపెనీలు అందుకు సానుకూలంగా స్పందిస్తున్నాయని అ న్నారు. టెన్త్ క్లాస్ నుంచి పీజీ వరకు, టెక్నికల్ కోర్సులు చేసిన వారు వివిధ విభాగాలకు ఎంపికయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. వేమూరులో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు మాస్టర్‌మైండ్స్, అపెక్స్ సొల్యూషన్స్, పేటీఎం, ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా 31 మంది యువతీ, యువకులు హాజరవ్వటంతో వారిలో 12 మందిని ఎంపిక చేసి ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి బి.శ్రీనివాస్, హబ్ కో-ఆర్డినేటర్ రత్నరాజేశ్వరి, జేఆర్‌పీ అరుణ్, కళాశాల సిబ్బంది హాజరయ్యారు.

దివ్యాంగ విద్యార్థులకు వసతులు కల్పించాలి

● రాష్ట్ర పరిశీలకుడు మల్లికార్జున్



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్రపరిశీలకుడు మల్లికార్జున్

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతులను కల్పించాలని రాష్ట్ర పరిశీలకుడు మల్లికార్జున్ తెలిపారు. పట్టణంలోని సరస్వతీమెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సహిత విద్యపై ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణకు జిల్లా సహిత విద్యా సమన్వయకర్త జోత్స్న అధ్యక్షత వహించగా మల్లిఖార్జున ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సహిత విద్యప్రాముఖ్యత, సహవిద్యను అభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు అందించే సదుపాయాలు, పథకాలు, దివ్యాంగ విద్యార్థులను గుర్తించుట, పాఠశాలలో చేర్పించటం గురించి వివరించారు. రాష్ట్ర పరిశీలకులు గీత వపర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా యు డైస్ ప్లస్ ఎలా చేయాలో పాఠశాల, మండల స్థాయిలో అనేది సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమశాఖ సిబ్బంది, బధిరుల ఆశ్రమ పాఠశాల సిబ్బంది, ఎఎల్ఎస్ సమన్వయకర్త సత్యసాగర్ పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించు... ప్రాణాలు కాపాడుకో

● పట్టణ సీఐ అహ్మద్ జానీ



హెల్మెట్ గురించి వివరిస్తున్న పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ, సిబ్బంది

బాపట్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పట్టణ సీఐ ఆర్.అహ్మద్ జానీ తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పట్టణ పోలీసులతో కలిసి సోమవారం ఆయన హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ద్విచక్రవాహన ర్యాలీని పురవీధులలో నిర్వహించారు. రహదార్లపై జరుగుతున్న ప్రమాదాలలో మృత్యువాత పడుతున్న వారిలో ఎక్కువమంది ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారే అన్నారు. దీనికి ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవటమేనన్నారు. పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు అన్నారు. హెల్మెట్‌పై అవగాహన ర్యాలీని ఆయన సోమవారం చెరుకుపల్లిలో ప్రారంభించారు. ఐలాండ్ కూడలి నుంచి అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాద సమయంలో తలకు రక్షణగా ఉంటుందన్నారు. తద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. రేపల్లె రూరల్ సీఐ ఎ.సురేష్‌బాబు, చెరుకుపల్లి, నిజాంపట్నం ఎస్ఐలు జే.అనిల్‌కుమార్, కెవి తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ

అమృతలూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరులోని పంచాయతీ సిబ్బందికి సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులను, క్లాప్ మిత్రలను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ప్రభుత్వం అందించిన అలవెన్సులు, కొబ్బరి నూనె, గ్లౌజులు, సబ్బులు, చెప్పులు, దుస్తులను సర్పంచ్ దేవరకొండరాము, వార్డు సభ్యులు సుంకర మనోహర్, చేతుల మీదగా అందించారు. కార్యక్రమంలో అలూరి స్నేహలత, పంచాయతీ కార్యదర్శి బాల కృష్ణమూర్తి, జెపిఎ శ్రీనివాసరావు, బిల్ కలెక్టర్ రిజ్వాన్‌బాబు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావు ఏర్పాటు చేసుకున్న చెప్పుల దుకాణం

సినీ ప్రముఖులకు తెనాలి పాదరక్షలు!


చెప్పులు తయారుచేస్తున్న వెంకటేశ్వరరావు

సినీ పరిశ్రమల్లో పవర్‌స్టార్‌గా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్‌కల్యాణ్ ధరించే చెప్పులు తెనాలి ప్రాంతంలో తయారు చేసినవే.. తెనాలికి చెందిన గుండపు వెంకటేశ్వరరావు పాదరక్షకలు తయారీలో నైపుణ్యం పొందారు. తాను నేర్చుకున్న వృత్తిలోనే రాణిస్తూ అభిమాన హీరోలకు మంచి మోడళ్లతో నాణ్యమైన పాదరక్షకలు ప్రత్యేకంగా తయారు చేసి వారికి అందజేసి ప్రశంసలు అందుకుంటున్నారు. తెనాలికి చెందిన పాదరక్షకుల తయారీదారుడు గుండపు వెంకటేశ్వరరావు సినీ హీరో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మనస్సుకు చేరువయ్యాడు.

- పలు సినిమాల్లో కథానాయకులకు తయారీ
- పాత్రలకు తగ్గట్టు ప్రత్యేక డిజైన్లు..
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మెచ్చిన చెప్పులు
- సినీ పరిశ్రమలో తెనాలి కీర్తిని చాటుతున్న గుండపు వెంకటేశ్వరరావు

తెనాలి రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తెనాలి గంగానమ్మపేటకు చెందిన గుండపు వెంకటేశ్వరరావు పాదరక్షకలు తయారుచేస్తూ జీవనం సాగించేవారు. రెండు దశాబ్దాలుగా సినీ పరిశ్రమలోని పలువురు కథానాయకులకు, రాజకీయ నాయకులకు వారు మెచ్చేలా పాదరక్షకులను తీర్చిదిద్దుతూ సినీ పరిశ్రమలో పరిచయం ఏర్పరుచుకున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సినీ హీరో పవన్‌కల్యాణ్‌కు వెంకటేశ్వరరావు ప్రత్యేకంగా చెప్పులని తీర్చిదిద్ది అందజేశారు. కొద్దికాలంగా పవన్‌కల్యాణ్ అవే పాదరక్షలను ధరిస్తూ తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. పవన్‌కల్యాణ్ తనకు చెప్పులు కుట్టిన వెంకటేశ్వరరావుని సన్మానించి, అతడికి రూ.లక్ష చెక్కును అందజేసి అభినందించారు. తరువాత వెంకటేశ్వరరావు పాదరక్షకలు తయారీలో సినీ పరిశ్రమలో వెలుగులోకి వచ్చారు.

సినీ పరిశ్రమతో పరిచయం..

గతంలో సినీ పరిశ్రమలోని ఐశ్వర్య కాస్ట్యూమ్స్ డిజైనర్ దగ్గర పాదరక్షలు తయారుచేసే పనిలో వెంకటేశ్వరరావు ఉన్నారు. ఆ క్రమంలో సుమారు 20 సినిమాలకు పనిచేసి కథానాయకుల పాత్రలకు తగ్గట్టు పాదరక్షలు తయారు చేసి ఇచ్చారు. మొదటగా నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన గౌతమీపుత్ర శాతకర్ణి సినిమాకి వెంకటేశ్వరరావు పనిచేశారు. అనంతరం సినీ పరిశ్రమలోని ప్రముఖ హీరోలైన చిరంజీవి, రామ్‌చరణ్, ప్రభాస్, అల్లు అర్జున్, దుల్కర్‌సల్మాన్, మంచు విష్ణు, సాయిదుర్గాతేజ్ పలువురు నటించిన పాత్రలకు ఆయన పాదరక్షలను తయారుచేసి అందజేశారు.

పవన్‌కల్యాణ్‌పై అభిమానంతో..

పవన్‌కల్యాణ్‌పై ఉన్న అభిమానంతో ఆయనకు చెప్పులు కుట్టడం వల్ల తనకు ఇంత గుర్తింపు వచ్చిందని తను తయారుచేసిన చెప్పులతో నడుస్తూ అసెంబ్లీకి, పార్టీ కార్యక్రమాలకు వెళ్తుంటే తనకు చాలా ఆనందంగా ఉందని చెప్పారు. అంతేకాకుండా తనలోని నైపుణ్యాన్ని ప్రత్యేకంగా గుర్తించిన వ్యక్తి పవన్‌కల్యాణ్ అని చెప్పారు. తనకు ఇచ్చిన రూ.లక్షతో సొంతంగా షాపు పెట్టుకున్నానని తనను ఆదరించిన సినిమా పరిశ్రమకు రుణపడి ఉంటానని తెలిపారు.


చెప్పులు తయారు చేస్తున్న వెంకటేశ్వరరావు

పవన్ కల్యాణ్‌కు ప్రత్యేకంగా..

“కాటమరాయుడు సినిమాలో పవన్‌కల్యాణ్ ధరించిన చెప్పులు వెంకటేశ్వరరావు తయారు చేసినవే. ఆయన తయారుచేసిన పాదరక్షలు ఒక వైపు ఉబ్బెత్తుగా ఉండి, ఎంతో మెత్తగా, సున్నితంగా ఉండటంతో పవన్‌కల్యాణ్‌కి ఎంతో నచ్చాయి. దీంతో ఆయన వ్యక్తిగతంగానూ వెంకటేశ్వరరావు దగ్గరే పాదరక్షలను ప్రత్యేకంగా తయారు చేయించేవారు. అనంతరం పవన్‌కల్యాణ్, వెంకటేశ్వరరావు నైపుణ్యాన్ని మెచ్చి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆ నగదుతో వెంకటేశ్వరరావు తెనాలి పట్టణంలోని గంగానమ్మపేటలో 'రమణ ఫుట్‌వేర్' పేరుతో షాపు పెట్టుకుని మరో ఇద్దరికి జీవనోపాధి కల్పిస్తూ జీవనం సాగిస్తున్నారు. పలువురు అగ్రహీరోలకు సైతం చెప్పులు కుట్టి వారి మన్ననలు పొంది తెనాలి ప్రాంత ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేశారు.”

ఆగని.. ఆటోల్లో దోపిడీలు



- ప్రయాణికులను హడలెత్తిస్తున్న ముఠాలు
- ఇటీవల నగరానికి చెందిన 10 మంది అరెస్ట్
- అయినా ఆగని నేరాలు
- పని చేయని సీసీ కెమెరాలు

గుంటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులలా నటిస్తూ ఆటోలలో ఒంటరిగా ప్రయాణించే వారిని దోచుకుంటున్న ముఠాల కార్యకలాపాలు మళ్లీ గుంటూరు నగరంలో ఊపందుకున్నాయి. తెనాలి కేంద్రంగా పెద్ద ఎత్తున ఈ తరహా దోపిడీలకు పాల్పడిన గుంటూరు నగరానికి చెందిన పదిమంది ముఠా సభ్యులను ఇటీవల తెనాలి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా తెనాలి కేంద్రంగా పెద్ద ఎత్తున ఆటోలలో ప్రయాణికులను దోచుకుంది. అయితే ఆయా ముఠాల్లో ఉన్న వారంతా గుంటూరు నగరానికి చెందిన వారు కావడం గమనార్హం. అయితే ఆయా ముఠాల అరెస్టుతో ఈ తరహా నేరాలు ఆగిపోతాయని పోలీసులు భావించారు. అయితే తాజాగా అలాంటి సంఘటనలు మళ్ళీ జరగడం స్థానికుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రివేళ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో ఎక్కిన ఇరువురు బీహారీలను దుండగులు నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో దారి మళ్లించి వారిపై దాడి చేసి సెల్ ఫోన్, నగదు అపహరించుకుపోయారు. తాజాగా అరండల్ పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జి సెంటర్ వద్ద నరుకుళ్ళపాడు గ్రామానికి చెందిన ఆంజనేయ వరప్రసాద్ అనే వృద్ధుడి జేబులో నుంచి 23 వేలు కొట్టేశారు. ఈనెల 17న మధ్యాహ్నం ఆంజనేయ ప్రసాద్ నరుకుళ్ళపాడు వెళ్లేందుకు లాడ్జి సెంటర్లో ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో వెనుక ఇరువురు, డ్రైవర్ సీట్ పక్కన మరొకరు ఉన్నారు. దీంతో ఆంజనేయ వరప్రసాద్ వెనుక సీట్లో కూర్చున్నారు. అయితే ఆటో కొద్ది దూరం వెళ్ళగానే ముందుగా అక్కడ పోలీసులు తనిఖీలు చేస్తున్నారని, ముందు సీటులో ఉన్న వ్యక్తిని పథకం ప్రకారం వెనక్కు పంపాడు. ఆయనను మధ్యలోకి జరిపారు. ఆటోలో ఇరుకుగా ఉన్నట్లు మిగిలిన ముగ్గురు ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ హడావిడి చేసి ఆయన వెనుక జేబులో పెట్టుకున్న రూ.23 వేలను కొట్టేశారు. ఆటో కొద్దిదూరం వెళ్ళగానే పక్కన ఉన్న వ్యక్తి దిగాలని చెప్పి ఆంజనేయ ప్రసాద్‌ను దించారు. ఆయన అడుగు కిందకు పెట్టిన వెంటనే ఆటోలో నుంచి మిగిలిన వారు దిగకుండానే ఆటో దూసుకుపోయింది. ఆ తర్వాత ఆయన జేబులో చూసుకోగా 23వేలు మాయమయ్యాయి. ఇదే తరహాలో ఇటీవల నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోనూ మరో ఘటన చోటుచేసు కుంది. రాత్రి గాని, పగలుగాని ఒంటరిగా ఆటోల్లో ఎక్కే ప్రయా ణికులను లక్ష్యంగా చేసుకొని ఆయా ముఠాలు ఈ విధం గా దోపిడీలకు పాల్పడుతున్నా యి ఈ నేపథ్యంలో ఒంటరిగా ఆటో ఎక్కే ప్రయాణి కులు జాగ్రత్త గా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉం ది. ఈ ముఠాల కార్యకలాపాలతో ప్రయాణీకులు ఆటోలు ఎక్కాలంటేనే హడలెత్తి పోతున్నారు.

అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు

గుంటూరు పట్టణంలో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారాయి. నగరం నడిబొడ్డున నేరం జరిగినా కనీసం ఆనవాళ్లను గుర్తించే పరిస్థితిలో కూడా సీసీ కెమెరాలు లేవు. తెలుగుదేశం ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వంలో వాటిని పక్కన పడేయడంతో నగరం లో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆయా సీసీ కెమెరాలపై దృష్టి సారించి పనులు నిర్వహిస్తోంది. అదేవిధంగా అమరావ తి రోడ్డు నుంచి సుమారు కిలోమీటర్ పరిధిలో ఈ నేరం జరిగినప్పటికీ రోడ్డు పక్కన ఉన్న వ్యాపార, వాణిజ్య సముదాయాల్లోనూ సరైన సీసీ కెమెరాలు లేవని తెలుస్తోంది. ఆటో ఆనవాళ్ళను గుర్తించేందుకు అరండల్‌పేట క్రైం పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అయినప్పటికీ ఆటోను గుర్తించేందుకు పోలీసులు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు మరోసారి సీసీ కెమెరాలపై దృష్టి సారించి సంబంధిత నేరానికి పాల్పడిన ఆటోను గుర్తించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా వ్యాపార సముదాయాల్లో మెయిన్ రోడ్లను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాల్సిన అవసరం కూడా ఉంది.

సేంద్రియ ఆహారంతోనే ఆరోగ్యం

- డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు


అవార్డు గ్రహీతలతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, కమిషనర్ ఢిల్లీరావు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, మిద్దెతోట నిపుణుడు రఘోత్తమ రెడ్డి

వట్టిచెరుకూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మనం తినే ఆహారంలో ఉంటున్న రసాయనిక అవశేషాలు మన ఆరోగ్యాన్ని కొంత మేర దెబ్బతీస్తున్నాయని, రసాయనాలు లేని ఆహారాన్ని తినటమే అన్నింటికి పరిష్కారం అని రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు పంచాయతీ పరిధిలోని రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతు నేస్తం, మిద్దె తోటల పురస్కారం - 2024 కార్యక్రమానికి రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇంట్లో మొక్కలు పెంచుకొనే వారు చాలా వరకు రసాయనాలు ఉపయోగించకుండా చిన్న చిన్న మెళకువలు పాటిస్తూ చీడ, పీడలను నివారించుకుంటూ సేంద్రియ పద్ధతుల్లో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు పెంచు కోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఇంటి మొక్కలు పెంచుకొనే వారికి ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందించడానికి తన వంతు కృషి, పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. ఇంటి పంటలపై శ్రద్ధ పెరుగుతుందని, నగరంలో ఉన్న మిద్దె తోటలను సందర్శించి వారు వినియోగించే సేంద్రీయ ఎరువులు, వాడే విధానాన్ని తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని ఢిల్లీ రావు అన్నారు. తొలుత మాజీ ప్రధాని స్వర్గీయ చౌదరి చరణ్‌సింగ్ జయంతిని అంతర్జాతీయ దినోత్సవంగా జరుపుకోవడం హర్షణీయమని, చరణ్‌సింగ్ చిత్రపటానికి డీజీపీ సీహెచ్ తిరుమలరావు, కమిషనర్ ఢిల్లీరావు, వెంకటేశ్వరరావు, రఘోత్తమరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుమ్మేటి రఘోత్తమరెడ్డి రైతు నేస్తం పురస్కారాలు 2024 అవార్డులను అందజేశారు. అవార్డు పొందిన వారు ఎంతో మందికి స్ఫూర్తిని కలిగించి ఇంటి పంటదారుల సంఖ్యను పెంచడంలో కృషి చేస్తారని తిరుమలరావు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలతో పాటు పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం జిల్లాకోర్టు ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతీ జగడం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారధి, రిటైర్డ్ జడ్జి ఎస్.జేసు రత్నకుమార్, పాస్టర్ రెవరెండ్ వై.యోహాన్ రాజు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అనురాధ, ట్రెజరర్ దేవదాసు, సీనియర్ న్యాయవాదులు యం.నాగేశ్వరరావు, డేవిడ్ లూదర్‌బాబు, సుభకర్, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి

ఎస్సీ కార్పొరేషన్‌లో...

తాడేపల్లి టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజమైన ప్రేమతత్వం కలిగిన వ్యక్తి జీసస్ అని కొనియాడారు. క్రిస్మస్ సందర్భంగా నిరుపేద కుటుంబాలకు చేతనైన సహాయం చేయాలని ఎదుటివారికి సహాయం చేసే మనస్సు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆమె అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కృష్ణవేణి, కూటమి నేతలు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

అవిశ్రాంత సాహితీ శ్రామికుడు.. లక్ష్మీనారాయణ

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అవిశ్రాంత సాహితీ శ్రామికుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడం గర్వకారణమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ గత 40 ఏళ్ళగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాహిత్య రంగంలో అనేక పెడ ధోరణులు వ్యక్తమవుతూ కలుషితమవుతున్న నేపథ్యంలో, అభ్యుదయ సాహిత్యానికి గుర్తింపు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ ఇటీవల రాసిన గుంటూరు సీమ సాహిత్య చరిత్ర అనే గ్రంథంలో అనేక విషయాలు వెల్లడించారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ మాట్లాడుతూ ఆయనకు దక్కిన అవార్డు అభ్యుదయ సాహిత్యానికి లభించిన గుర్తింపు అని అన్నారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం మూలాలను పరిశీలిస్తే, పేదల సమస్యల పరిష్కారం, అభ్యుదయ భావజాలాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకవెళ్ళడమేనని అన్నారు. సభలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎన్.కాళిదాసు, సీఎస్సార్ ప్రసాద్, కవులు, కళాకారులు పాల్గొన్నారు.


పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న పాపినేని శివశంకర్, కేఎస్ లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు తదితరులు





క్రిస్మస్ సందడి

- నూతన శోభ సంతరించుకున్న చర్చిలు
- ఆకర్షణీయ రంగులతో వెలుగొందుతున్న స్టార్లు
- కిటకిటలాడుతున్న దుకాణాలు

గుంటూరు, ఫిరంగిపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సందడి నెలకొంది. ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకునే క్రిస్మ స్ వేడుకలకు మరికొద్ది గంటల సమయం మాత్రమే ఉండడంతో క్రైస్తవ సోదరులు పండు గ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చర్చీలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గుంటూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినాన్ని స్వాగతిస్తూ ఏర్పాటు చేసిన స్టార్లు ఆకర్షణీయంగా వెలుగొందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని దుకాణాలన్నీ కిటకిటలాడుతు న్నాయి. ముఖ్యంగా వస్త్ర దుకాణాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. గడిచిన రెండు రోజులుగా అన్ని దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి, ఆఫర్లతో భక్తులను ఆకట్టునేందుకు వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. అదే విధం గా మిఠాయి దుకాణాల్లో కూడా సందడి నెలకొంది. నేటి అర్ధరాత్రి పూజలతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమవుతాయి.

ఫిరంగిపురంలో విస్తృత ఏర్పాట్లు

ఆంధ్రా రోమ్‌గా పిలిచే ఫిరంగిపురంలో ఈనెల 24, 25 తేదీల్లో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరగను న్నాయి. రాష్ట్రంలోనే అతి పెద్ద దేవాలయంగా 1891లో లండన్ మిల్ హిల్‌కు చెందిన ఫాదర్ థియోడర్ డిక్మన్ స్వామి నిర్మించారు. 24వ తేదీ ఉదయం 5:30 గంటలకు రెవరెండ్ ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి ఆధ్వర్యంలో దివ్య పూజా బలి జరుగుతుంది. రాత్రి 11:30 గంటలకు క్రీస్తు జయంతి మహోత్సవ జాగరణ దివ్య పూజాబలిని గుంటూ రు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య నిర్వహిస్తారు. 25వ తేదీ ఉదయం 5:30 గంటలకు రెవరెండ్ ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి, 8 గం టలకు శ్రీకాకుళం డయాసిస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ తుమ్మా జోమ్నిక్, సాయంత్రం 5:30 గంటలకు కొండమెట్ల వద్ద దివ్య పూజా బలిని ఫాదర్ ఉప్పులూరి రవీంద్రలు నిర్వహిస్తారు. సాయం త్రం 7 గంటలకు వివిధ కాలనీలు, వివిధ గ్రామాల నుంచి తేర్లు ఊరేగింపు, 10 గంటలకు కొవ్వొత్తుల సమర్పణ, రాత్రి 9 గంటలకు బాణ సంచాతో, మేళ తాళాలతో తేరును గ్రామ పుర వీధుల్లో ప్రదక్షణలు చేయనున్నామని రెవరెండ్ ఫాదర్ మాలపాటి పాతి మా మర్రెడ్డి తెలిపారు.


ఫిరంగిపురంలో క్రిస్మస్ వేడుకలకు కాంతులీనుతున్న బాల ఏసు చర్చి



భూకంపంపై భయపడొద్దు

ముండ్లమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూకంపంపై భయాందోళనలు చెందవద్దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ముండ్లమూరు మండలంతో పాటు పలు ప్రాంతాల్లో వరుసగా మూడు రోజుల నుంచి భూకంపం వస్తుండటంతో సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్‌కు విషయం తెలిపి డిజార్డర్‌తో పరిశోధన చేసేవిధంగా చూడాలని తహసీల్దార్‌ను కోరారు. భూకంప పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌కు వివరిస్తానని శ్రీకాంత్ తెలిపారు. ప్రజలతో పాటు స్కూల్ విద్యార్థులు తీవ్రంగా భయ పడుతున్నారని, వారిలో ఉన్న భయాన్ని పోగొట్టాలని లక్ష్మి కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సీఐ వై.రామారావు తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌బాల్ ఇండియా క్రికెట్ జట్టుకు జిల్లా కుర్రాడు



సృజన్

ఒంగోలు, కార్పొరేషన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) :టెన్నిస్ బాల్ క్రికెట్ ఇండియా జట్టుకు జిల్లా కుర్రాడు దార్ల సృజన్ ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండో-నేపాల్‌లో జరిగే క్రికెట్ పోటీలలో సృజన్ ఇండియా జట్టు తరుపున పాల్గొంటున్నట్లు తెలిపారు. గతంలో అనేక మ్యాచ్‌లు ఆడి రాణించిన ఆయన ఇండియా జట్టుకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈమేరకు సృజన్ సోమవారం శాప్ ఛైర్మన్ రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

31లోపు అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు విద్య, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్ మీడియేట్ కోర్సులకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వతేదీలోపు ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1నుంచి 4వతేదీ వరకు రూ. 25 అపరాధ రుసుం, 5నుంచి 8వ తేదీ వరకు రూ. 50 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. పదవ తరగతిలో ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 100 వంతున, ఇంటర్‌లో ఒక్కొక్క సబ్జెక్టుకు రూ. 150 వంతున పరీక్షఫీజు చెల్లించాలని ఆయన కోరారు. ఓపెన్ స్కూలు కో ఆర్డినేటర్లందరూ తమ వద్ద అడ్మిషన్లు పొందిన విద్యార్థులందరిచేత పరీక్ష ఫీజు చెల్లింపజేయాలన్నారు.

అర ఎకరా స్థలం చూపిస్తే చెరువు ఏర్పాటు చేస్తాం

టంగుటూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏ గ్రామంలోనైనా అర ఎకరా స్థలం చూపిస్తే అమృత్ సరోవర్ పథకం కింద చెరువు నిర్మించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని ఉపాధి హామీ ఏపీవో సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. దాతల సహకారంతో ట్రాక్‌పై బల్లలు వేస్తామన్నారు. తాను గ్రామానికి అర ఎకరా ప్రభుత్వ భూమి చూపించాలని నెల క్రితమే తహసీల్దార్ ఆంజనేయులును కలిసి కోరానని తెలిపారు. ప్రస్తుతం రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, అవి ముగియగానే స్థలాలను గుర్తిస్తామని తహసీల్దార్ చెప్పారన్నారు.

గుప్తనిధుల ఆశచూపి టోకరా

మార్కాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తన పొలంలో రూ.కోట్ల విలువైన గుప్త నిధులున్నాయని వాటిని వెలికితీసేందుకు ఆర్థికసాయం చేస్తే ఒకటికి మూడు రెట్లు డబ్బులిస్తానని నమ్మబలికిన ఓ వ్యక్తిపై మార్కాపురం పట్టణ ఎస్సై సైదుబాబు సోమవారం కేసు నమోదు చేశారు. ఆయన కథనం మేరకు, స్థానిక విద్యానగర్‌కు చెందిన ముటుకుల సుబ్రహ్మణ్యం ఓ న్యాయవాది వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పొలంవివాదం నేపథ్యంలో పెద్దారవీడు మండలం కలనూతలకు చెందిన గోద నడిపయ్య న్యాయవాది వద్దకు వస్తుండేవాడు. ఈ క్రమంలో గుమస్తా సుబ్రహ్మణ్యంతో నడిపయ్యకు పరిచయం ఏర్పడింది. వివాదంలో ఉన్న పొలంలో రూ.కోట్ల విలువైన గుప్త నిధులున్నాయని గుమస్తాకు నడిపయ్య తెలిపాడు. తన దగ్గర డబ్బులు లేవని రూ.10 లక్షలు ఇస్తే తాను మూడు రెట్లు తిరిగిస్తానని నమ్మబలికాడు. ఈ విషయంలో తనకు ఝాన్సీ, రవి అనే వాళ్ల సాయం చేస్తారని చెప్పాడు. దీంతో గుమస్తా సుబ్రహ్మణ్యం తన వద్ద రూ.6 లక్షలు మాత్రమే ఉన్నాయని సుబ్రహ్మణ్యం చెప్పాడు. ఆ డబ్బులను నడిపయ్య సూచన మేరకు గుప్తనిధులను తవ్వితీసే ఝాన్సీ అనే మహిళకు పంపించాడు. ఈ సంవత్సరం మార్చిలో ఫోన్‌పే ద్వారా విడతల వారీగా ఝాన్సీకి సుబ్రహ్మణ్యం నగదు పంపాడు. అయితే నెలలు కావస్తున్నా తాను పంపిన డబ్బుల గురించి నడిపయ్య సమాధానం చెప్పలేదు. దీంతో సెప్టెంబరులో సుబ్రహ్మణ్యం నిలదీశాడు. దీంతో పలువురు మధ్యవర్తుల సమక్షంలో నడిపయ్య రూ.6 లక్షలకు ప్రామిసరీ నోటు రాసిచ్చాడు. ఆ తర్వాత నుంచి నడిపయ్య కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన సుబ్రహ్మణ్యం సోమవారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ప్రతిష్ఠోత్సవం







ఆలయంలో ప్రతిష్ఠించిన జీవధ్వజస్తంభం, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి హర్షవర్ధన్, స్వామి శాంతి కల్యాణంలో క్రతువు నిర్వహిస్తున్న దంపతులు

గోవింద నామ స్మరణతో పులకించిన కొండమంజులూరు

కల్యాణాన్ని తిలకించి తరించిన భక్తజనం

పంగులూరు, డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు గ్రామంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసింది. భక్తుల గోవింద నామంతో హోరెత్తింది. నిర్ణీత దివ్య ముహూర్తంలో ప్రముఖ వేద పండితులు రొంపిచర్ల వెంకట సత్యనారాయణాచార్యులు వారి పరివారంతో ఆలయ మూలవిరాట్ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, ద్వారపాలకులు, విమాన శిఖర కలశ, జీవధ్వజ పీఠారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గాలి గోపురం, కలశ ప్రతిష్ఠాపనతో శోభను సంతరించుకున్న వేణుగోపాలస్వామి ఆలయాన్ని తిలకించిన భక్తులు భక్తి పారవశ్యంతో పూజలు చేశారు.

వేద మంత్రోచ్ఛరణతో స్వామి శాంతి కల్యాణం

దేవతామూర్తుల ప్రతిష్ఠాపన అనంతరం పీఠబంధనం, ప్రాతఃసవనం, వాస్తుశుద్ధి ప్రధాన హోమం, కలాన్యాసం, దృష్టికుంభం దేను దర్శనం, కుంభాభిషేకం, స్వామి దివ్య మంగళ విగ్రహ సందర్శనం, మహార్నివేదన, హారతి, ఆచార్యాది దక్షిణాదానం నిర్వహించి మహాపూర్ణాహుతిని గావించారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శాంతి కల్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శాంతి కల్యాణ మహోత్సవంలో 20 మంది సతీసమేతంగా పాల్గొని పూజలు చేశారు. వేదపండితులు వెంకట సత్యనారాయణాచార్యులు, వారి శిష్య బృందంతో పాటు అర్చక స్వాములు ప్రసాద్‌బాబు, శ్రీనివాస్, రాంబాబులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హర్షవర్ధన్

ప్రతిష్ఠోత్సవంలో గొట్టిపాటి హర్షవర్ధన్.. స్వామి ఆలయ పునర్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవో కోటిరెడ్డితో పాటు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు, రావుల బాపయ్య, కల్లూరి కోటేశ్వరరావు, బొప్పూడి నాగేశ్వరరావు, దొప్పలపూడి వీరయ్య, పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, మస్తాన్‌వలి, ఓబుల్‌రెడ్డి, గుర్రం ఆదిశేఖర్, రావూరి రమేష్, భానుప్రకాష్ అశోక్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వైవీ భద్రారెడ్డి, జంపని రవిబాబు, పానెం నరసింహారెడ్డి, మన్నె రామారావు, రాజేష్, హరిబాబు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

ప్రతిష్ఠోత్సవానికి గ్రామస్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, బంధువులు, స్నేహితులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీవారు భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అనధికారిక లేఅవుట్లు.. ఇసుక దందా

చీరాలలో అధికారులకు సవాల్‌గా నిలుస్తున్న అక్రమార్కులు

కఠిన చర్యలు చేపట్టడమే సమస్యకు పరిష్కారం

వేటపాలెం/చీరాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో అనధికారిక లేఅవుట్లు, ఇసుక అక్రమ దందాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన వ్యక్తులలో ముఖ్యులు ఆ విషయాన్ని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీలు వేరైనా అక్రమ సంపాదనలో పార్టీలకతీతంగా కొందరు నేతలు కలసి పనిచేసుకుంటున్నారు. పాలక, ప్రతిపక్షాలకు చెందిన వారు కలసి అక్రమ దందా సాగిస్తుండడంతో ఏ చర్యలు తీసుకోవాలో అర్థంకావడం లేదని అధికారులు వాపోతున్నట్లు సమాచారం. అందుకు ప్రజాప్రతినిధి అండే కారణమా అన్న కోణంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇసుక వ్యవహారం ఇలా ఉండగా.. అదే స్థాయిలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వేటపాలెం మండలం నాయినిపల్లి పరిధిలోని ఓ ప్రైవేటు కళాశాల సమీపంలో 216 జాతీయ రహదారి పక్కన వేసిన లేఅవుట్ మాదిరి అనేక లేఅవుట్లకు ఎలాంటి అనుమతులు లేవు. జాండ్రపేటకు చెందిన ఓ వస్త్ర వ్యాపారి ఆ వెంచర్‌ను వేసినట్లు సమాచారం. ఇలాంటి అనుమతులులేని వెంచర్లు అనేకం ఉన్నాయి.



అనధికారిక లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు(ఫైల్)

ఇసుక అక్రమాల వెనుక అదృశ్య హస్తం ఎవరిది?

చీరాల నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇది బహిరంగంగా అందరికీ తెలిసిన విషయమే. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అనధికారిక ఇసుక తవ్వకాలు, రవాణాను మించిప్రస్తుతం ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరగడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



పుల్లరిపాలెం గ్రామస్థులను విచారిస్తున్న తహసీల్దార్ పార్వతి(ఫైల్)

ఎవరీ ఆర్‌ఆర్?

ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా వెనుకున్న అదృశ్య హస్తం ఆర్‌ఆర్. ఎవరీ ఆర్‌ఆర్? ప్రస్తుతం అందరిలో నడుస్తున్న చర్చ ఇది. ఆర్‌ఆర్ అనే వ్యక్తి చీరాల నియోజకవర్గం చెందిన వ్యక్తి కాదు. ఇతర ప్రాంతం నుంచి వలస వచ్చాడు. గత ఎన్నికల్లో టీడీపీకి పనిచేశాడు. కొన్ని వందల మందిలో అతను ఒకడు. అయితే ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఇసుక దందాకు ఆయనే మహారాజు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖలకు సంబంధించిన అధికారులు ఆర్‌ఆర్ మాటే వింటున్నారు. అందుకు ఎవరి అండ ఉందో వేరేరకంగా చెప్పాల్సిన అవసరం లేదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు.

అక్రమ లేఅవుట్లు, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి

పార్వతి, తహసీల్దార్, వేటపాలెం మండలం

అక్రమ లేఅవుట్లు, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. నిబంధనలు అతిక్రమించిన ఎవరినీ ఉపేక్షించం. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాం. పూర్తిస్థాయి పరిశీలన అనంతరం అక్రమార్కులను గుర్తించి తగిన చర్యలు చేపడతాం. ఎవరినీ ఉపేక్షించం.

అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మీకోసం కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలను సహేతుకంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మీకోసం అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. వాటిని పరిష్కరిస్తున్న తీరును ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు సూక్ష్మంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. మొక్కుబడి సమాధానాలు చెప్పి అర్జీదారులను పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ కూడా కరెక్ట్‌గా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్ తదితరులు ఉన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

- తన కుమారుడు మనోహరాచారి దివ్యాంగుడిగా జన్మించాడని, పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలని పీసీపల్లికి చెందిన మారెళ్ల నరసింహాచారి కోరారు. కనీసం సదరం సర్టిఫికెట్ కూడా ఇవ్వకపోవడంతో పింఛన్ తీసుకొనేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు.
- ప్రభుత్వ భూమిని ఆక్రమించి గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని సంతనూతలపాడుకు చెందిన కుంచాల వీరబ్రహ్మయ్య, తన్నీరు అంకయ్య, కే పాపారావు, కేవీ రామయ్య తదితరులు కోరారు. సంతనూతలపాడు మండలం పిడతలగుడిపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని పిడతలగుడిపాడు డొంకరోడ్డులో ఆరు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చేశారని ఫిర్యాదు చేశారు.విచారణ చేసి అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.



నిరసన తెలుపుతున్న భూ బాధితులు

మా భూమి ఇప్పించకపోతే ఆత్మహత్యే శరణ్యం

కుటుంబ సభ్యులతో కలెక్టర్ ఎదుట నిరసన

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : తమ భూమిని తమకు అప్పగించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని కొండపి మండలం పెట్లూరుకు చెందిన చెంచురామయ్య, చంద్రమౌళిలు హెచ్చరించారు. కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం గ్రీవెన్స్ హాలులో కలెక్టర్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 450 సర్వేనెంబరులోని 4.40 ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించుకున్నారని తెలిపారు. కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సార్లు అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గతంలో జేసీ, ఆర్డీవోలు ఆ స్థలంలోకి ఎవరూ వెళ్లరాదని బైండోవర్ చేసినా అవేమి పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. తమకు న్యాయం చేసి ఆదుకోవాలని నినాదాలు చేశారు. గ్రీవెన్స్‌సెల్‌లో ఒక్కసారిగా అరుపులు, కేకలు హోరెత్తడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసులు వారితో మాట్లాడి శాంతింపజేశారు.

అర్జీదారులకు ఉచితంగా రాగి జావా



గ్రీవెన్స్‌సెల్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకానికి జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉచితంగా రాగి జావను అందజేశారు. మధ్యాహ్న సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాగిజావాతో మంచినీటిని కూడా అక్కడ ఏర్పాటు చేశారు.

దివ్యాంగులకు బాసటగా....



వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చే దివ్యాంగులకు బాసటగా సంతనూతలపాడు మండలం మంగమూరుకుచెందిన దివ్యాంగుడు ఎస్‌కే సంథాని నిలిచారు. గ్రీవెన్స్ సెల్ వద్దకు వచ్చే దివ్యాంగులతో మాట్లాడి వారికి అవసరమైన అర్జీలను రాసి ఇవ్వడంతో పాటు వారిని కలెక్టర్ వద్దకు పంపే విధంగా తన వంతుసహకారానికి శ్రీకారంచుట్టారు. విద్యాసాగర్ ఫౌండేషన్‌లో అకౌంటెండెంట్‌గా పనిచేస్తున్న సంథాని సోమవారం రోజు సెలవు పెట్టుకొని తోటి దివ్యాంగులకు బాసటగా నిలిచారు.

అవీఇవీ

ఆంధ్రకేసరి వర్సిటీ ఖోఖో జట్టు ఎంపిక



ఎంపిక చేసిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ పురుషుల ఖోఖో జట్టు

పంగులూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రకేసరి యూనివర్సిటీ పురుషుల ఖోఖో జట్టు ఎంపిక సోమవారం పంగులూరులో జరిగింది. ఈ ఎంపికకు ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ కళాశాలలు, బీపీఈడీ కళాశాలల నుంచి 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇంకొల్లు డీసీఆర్‌ఎం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీ సహకారంతో నిర్వహించిన ఎంపికకు ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్ పరిశీలకులుగా వ్యవహరించారు. జట్టు ఎంపిక డాక్టర్ జి.సాయిసురేష్ డీసీఆర్‌ఎం డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చిలుకూరి శ్రీధర్, ఎస్‌ఆర్‌ఆర్ అకాడమీ డైరెక్టర్, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి పర్యవేక్షణలో జరిగింది.

ఎంపికయిన క్రీడాకారులు

ఆంధ్రకేసరి వర్సిటీ పురుషుల ఖోఖో జట్టుకు ఎంపికైన వారి వివరాలను డాక్టర్ జి.సాయిసురేష్ ప్రకటించారు. జీవీఎన్ శివ, షేక్ అహమ్మద్, ఎ.వీరాంజనేయులు, కె.రామ్మోహన్, యు.గణేష్(వివేకానంద బీపీఈడీ కళాశాల పొదిలి), బి.లక్ష్మీనారాయణ(సిద్ధమూర్తి బీపీడీ, సింగరాయకొండ), పి.గోపి, ఎం.ప్రసాద్, వై.సుధీర్, కె.వెంకటేశ్వర్లు, ఎస్.షాలెంరాజు, జె.నవీన్, ఐ.ఏలియా, వి.సిద్ధుప్రసాద్, ఎం.మంత్రూనాయక్ (డీసీఆర్‌ఎం డిగ్రీ కళాశాల ఇంకొల్లు) ఎంపికయ్యారు. ఈ జట్టు ఈ నెల 27 నుంచి 31 వరకు తమిళనాడులోని తిరువయ్యూర్‌లో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీలలో పాల్గొంటారని చెప్పారు. వర్సిటీ ఏర్పాటు చేసిన తరువాత తొలిసారిగా క్రీడా జట్టును పోటీలకు పంపుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబులకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలం స్వాధీనం



ప్రభుత్వ స్థలంలో ఉన్న కంచెను తొలగించి స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్

మార్కాపురంరూరల్, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులదిన్నె గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి పలు వినతులను స్వీకరించారు. గ్రామంలోని సర్వేనంబరు 71-4లో ఎకరాలు 1.89 సెంట్ల ప్రభుత్వ భూమిని, 53-2 సర్వేనంబరులో ఎకరాలు 2.80 సెంట్ల భూమిని అక్రమంగా మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎనిబెర కృపానందంలు ఆక్రమించినట్లుగా వచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి ఆ భూమిలో అక్రమంగా వేసిన కంచెను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమణలు చేసుకున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓవరాల్ చాంపియన్ 'ప్రకాశం'

రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో జిల్లా విద్యార్థుల సత్తా



క్యారమ్స్ ఆడుతున్న క్రీడాకారులు

సింగరాయకొండ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌లో హోరాహోరీ జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 19 బాలబాలికల రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఓవరాల్ చాంపిన్‌షిప్‌ను సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో వి.జీవన్‌కుమార్ (ప్రకాశం), జి.రాజేష్ (ప్రకాశం), జె.నిషాల్ (విశాఖ), పి.నరసింహ (కడప), బాలికల విభాగంలో కె.సోని (ప్రకాశం), ఎస్.హేమశ్రీ (గుంటూరు), బి.వెంకటేశ్వరమ్మ (ప్రకాశం), ఐ.మృధు (విశాఖ) ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచారు. అండర్-17 విభాగంలో కె.చందు (ప్రకాశం), కె.సిద్ధు (ప్రకాశం), కె.వెంకటసాయికుమార్ (ప్రకాశం), సిహెచ్.స్టీఫెన్‌పాల్ (గుంటూరు), బాలికల విభాగంలో టి.గంగోత్రి (ప్రకాశం), ఎస్కే మెటీరా (ప్రకాశం), ఎస్కే. గఫ్రీనా (నెల్లూరు), కె.అగన్య (ప్రకాశం) వరుస స్థానాలను కైవసం చేసుకున్నారు. అండర్-19 విభాగంలో ఎస్.కె. మస్తాన్ (ప్రకాశం), పి.పవన్‌కుమార్ (ప్రకాశం). టి.అశోక్ (ప్రకాశం), బి.యోను (గుంటూరు) బాలికల విభాగంలో ఎస్.ప్రియదర్శిని, (విశాఖ), కె.హరిత (నెల్లూరు), జె.ధారిక (విశాఖ), ఇమహి (నెల్లూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలను సాధించారు. మూడు విభాగాల్లో జిల్లాకు చెందిన 13 మంది విద్యార్థులు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచి ఓవరాల్ చాంపియన్‌లుగా నిలిచారు. విజేతలైన విద్యార్థులకు హెచ్‌ఎం డీవీఎస్ ప్రసాద్, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎండీ హాజీరా బేగం, వ్యాయామ ఉపాధ్యాయులు మెడల్స్‌ను అందజేశారు.

ప్రభుత్వ జీవోనూ.. పట్టించుకోవడం లేదు

(5వ పేజీ తరువాయి)

ఆ భారాన్ని మోయాల్సి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో పండుగల సీజన్ నడుస్తోంది. క్రిస్మస్, సంక్రాంతి పండుగల సందర్భంగా వాహన విక్రేతలు డిస్కౌంట్లు, రాయితీలు ప్రకటిస్తారు. అలాంటి సమయంలో వినియోగదారులు వాహనాలు కొనేందుకు ఆసక్తి చూపుతారు. అలాంటి సమయంలో కూడా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు అందకపోవడంతో వినియోగదారులు తిరుగుముఖం పడుతున్నారు.


వినియోగదారులకూ రాయితీ..

తాజా పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం 12 శాతంగా వున్న రోడ్ ట్యాక్స్‌ను మినహాయించింది. దాంతో పాటు వాహనం ఖరీదులో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. తద్వారా లక్షకు రూ. 5వేలు చొప్పున వినియోగదారుడికి కలిసి వస్తుంది. లక్ష రూపాయల లోపు ఉన్న ఈ- ద్విచక్ర వాహనాలకు, రూ. 2 లక్షల లోపు ధర ఉన్న ఈ- 3 వీలర్స్‌కు, ఐదు లక్షలలోపు ధర ఉన్న సరుకు ఈ- రవాణా వాహనాలకు, రూ. 8 లక్షల లోపు ధర ఉన్న ఈ- ట్రాక్టర్లు, రూ. 2 కోట్ల లోపు ధర ఉన్న ఈ- బస్సులకు ఈ రాయితీ లభిస్తుంది. దాంతో పాటు స్క్రాప్ సర్టిఫికెట్ ఇస్తే వినియోగదారుడికి మరో 10 శాతం రాయితీ లభిస్తుంది. జీవో అమలులోకి రాకపోవడంతో వినియోగదారుడు ఆ రాయితీలన్నీ కోల్పోవాల్సి వస్తోంది. దీనిపై రవాణా శాఖ అధికారులను వివరణ కోరగా జీవో ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ విభాగం వారు జారీ చేసిందని, రవాణా శాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ జీవో జారీ చేసిన తరువాతే అది అమలులోకి వస్తుందని చెబుతున్నారు. జీవో గడువు ముగిసినరోజు అర్ధరాత్రి 12 గంటల నుంచే రోడ్ టాక్సును అమలులోకి తెస్తున్న రవాణా శాఖ, జీవో వచ్చి 15 రోజులు పూర్తయినా ఇప్పటికీ దాన్ని అమలు చేయకపోవడంపై వినియోగదారుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జీతాలు రాలేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

బాపట్లరూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యార్థులకు భోజనం తయారు చేసే మాకు జీతాలు ఇవ్వటంలేదంటూ మార్టూరు మండలం యద్దనపూడి గురుకుల పాఠశాలకు చెందిన మున్నంగికుమారి కె.చిరంజీవి, కారంపూడి రమేష్‌లు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో విలేకర్లతో మాట్లాడుతూ సంవత్సరం 5నెలలు నుండి జీతాలు రావటంలేదని నెలకు ఒక్కొక్కరికి 15వేల రూపాయల చొప్పున ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు జీతాలు పడలేదన్నారు.

నీటి సంఘాలకు సమస్యల సవాల్


చీరాల మండల పరిధిలో పంట కాలువలో ఏపుగా పెరిగిన గడ్డి

- కాలువల్లో పెరిగిన గడ్డి
- పొలాలకు సాగునీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవడం తక్షణ విధి
- ఆశాభావం వ్యక్తం చేస్తున్న రైతులు

చీరాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కేడబ్ల్యూడీ (కృష్ణా వెస్ట్రన్ డెల్టా) పరిధిలోని ఆయకట్టులో సాగుదారులు పరిస్థితి సంకటంగా మారింది. సాగునీరు సక్రమంగా విడుదల కాకపోవడం అందుకు కారణం. ఆయా సమస్యల పరిష్కారానికి సాగునీటి సంఘాల ప్రతినిధులు బాధ్యత వహించాల్సి ఉంది. తాజాగా ఎన్నికైన సాగునీటి సంఘాల బాధ్యులు తమ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తెరిగి అడుగులు వేయాలని ఆయకట్టులోని రైతులు సూచిస్తున్నారు. లేదంటే సాగునీటి సంఘాల బాధ్యులతో తమకెలాంటి ప్రయోజనం ఉండదని చెప్తున్నారు. చీరాల, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో సాగునీటి సంఘాల ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సమస్యలు సవాల్‌గా మారుతున్నాయి. పలుచోట్ల కాలువల్లో పూడికతలు జరగలేదు. దీంతో పాటు పలుచోట్ల కాలువల్లో నాచు, తుంగ, గడ్డి ఏపుగా పెరిగి నీటి పారుదలకు ఆటంకం కలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా సాగునీటి సంఘాలకు జరిగిన ఎన్నికల క్రమంలో బాధ్యులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం కొమ్మమూరు ఆయకట్టు పరిధిలో మాగాణి సాగు జరుగుతోంది. ఆయకట్టు పరిధిలో అధికారికంగా, అనధికారికంగా సుమారు లక్ష ఎకరాల్లో మాగాణి సాగు జరుగుతోంది. కొమ్మమూరు కాలువ పరిధిలో సుమారు 70వేల నుంచి 80వేల ఎకరాలు సాగవుతోంది. మరో 20వేల ఎకరాలు ఆయకట్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల ద్వారా సాగవుతోంది. అయితే ఆయకట్టు పరిధిలోని ఆ 20వేల ఎకరాలతో పాటు, దిగువ ప్రాంతంలోని మాగాణి సాగుకు అందాల్సిన సాగునీరు సక్రమంగా అందాలంటే కాలువలు సక్రమంగా ఉండాలి. నల్లమడ లాకుల నుంచి పెదగంజాం సీమౌత్ వరకు కాలువలో సాగునీరు సక్రమంగా పారుదల ఉన్నప్పుడే ఆయకట్టులోని భూములకు నీరు సక్రమంగా అందేది. అందుకు అనుగుణంగా సాగునీరు పారుదలకు కాలువలు సక్రమంగా లేవు.

ఇక ఆయకట్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాల పరిధిలో సాగునీరు పారుదలకు సంబంధించిన కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి మరమ్మతులు నామ్‌కేవాస్తేగా జరిగాయి. అయితే సాగునీరు సక్రమంగా పారుదల జరిగే విధంగా చేపట్టాల్సిన చర్యలపై ప్రస్తుతం నీటి సంఘాల బాధ్యులుగా ఎన్నికైన వారిపై ఉంది. అందుకు అనుగుణంగా వారు అడుగులు వేయాలి. లేదంటే సాగునీటి సంఘాల ద్వారా తమకు ఒనగూరేదేమీ లేదని ఆయకట్టు రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల ప్రయోజనాలను కాపాడే దిశగా సాగునీటి సంఘాల బాధ్యులు తగిన అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.


మంత్రి ఆనంతో ఎమ్మెల్యే కొండయ్య

మంత్రి ఆనంను కలిసిన కొండయ్య

చీరాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సోమవారం కలిశారు. ఈ సందర్భంగా చీరాల నియోజకవర్గ అభివృద్ధికి దేవదాయశాఖ పరంగా తమవంతు సహకారం అందించాలని మంత్రి నారాయణరరెడ్డిని ఎమ్మెల్యే కొండయ్య కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆ సందర్భంగా నియోజకర్గ స్థితిగతులను ఎమ్మెల్యే కొండయ్య మంత్రికి వివరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న అధికారులు

బల్లికురవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధీ హామీ పథకం కార్యాలయంలో సోమవారం సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి ఉద్యోగులంతా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.కుసుమకుమారి, ఈవోపీఆర్డీ సుమతి, పీఆర్ ఏఈ మాధవ్‌రెడ్డి, ఏపీవో రమాదేవి, టీఏలు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చినగంజాం : క్రీస్తు చూపిన మార్గం సర్వ మానవాళికి అనుసరణీయమని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నా రు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో నడవాలని తహసీల్దార్ అన్నారు. దైవ సేవకులు అబ్రహం లింకన్‌బాబు క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. అనంతరం కేక్‌ను తహసీల్దార్ ప్రభాకరరావు కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి, ఎస్ఐ శీలం రమేష్, పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు, ఏపీఎం గద్దె సుబ్బారావు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు నరసింహారావు మృతి


నరసింహారావు (ఫైల్)

పంగులూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేణంగివరం ప్రాథమికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు టీవీ నరసింహారావు (51) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. కొద్దిరోజుల క్రితం అస్వస్థతకు గురై విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. రావినూతల గ్రామానికి చెందిన టీవీ నరసింహారావు 1995లో ఉపాధ్యాయ వృత్తిలో చేరి అద్దంకి, పంగులూరు మండలాలలోని పలు పాఠశాలలో పనిచేశారు. అద్దంకిలో నివాసం ఉంటూ ప్రస్తుతం రేణంగివరం యూపీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. యూటీఎఫ్ సంఘ నేతగా సేవలందిస్తూ జన విజ్ఞాన వేదికలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నరసింహారావు మృతిపట్ల హెచ్‌ఎం సందిరెడ్డి, శ్రీహరి, పలువురు ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నలుగురు అరెస్టు

బల్లికురవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఎస్ఐ జీవీ చౌదరి సిబ్బందితో కలిసి దాడి చేశారు. స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కొణిదెన శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.9070 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన జూదరులను కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

ఇంకొల్లు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ ఏడీ ఎస్.రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని ఇడుపులపాడు సబ్‌స్టేషన్‌లో రూ.6లక్షల వ్యయంతో నూతన బ్రేకర్లను ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న బ్రేకర్‌పై వ్యవసాయ కనెక్షన్లు కొనసాగుతాయని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్‌పై ఇడుపులపాడు, సూదివారిపాలెం, నాగండ్ల, అంకిరెడ్డివారిపాలెం గ్రామాలలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందజేసేందుకు బ్రేకర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంకొల్లులో 37 కొత్త స్తంభాలను మార్చనున్నట్లు తెలిపారు.

స్వచ్ఛతకు తూట్లు

కొణిదెన రోడ్లపై యథేచ్ఛగా వ్యర్థాలు

బల్లికురవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొణిదెన గ్రామానికి వచ్చి పోయే వారికి వ్యర్థాలు స్వాగతం పలుకుతున్నాయి. ఒక పక్క అధికారులు స్వచ్ఛత నినాదం పలుకుతుంటే.. మరోపక్క స్వచ్ఛతకు తూట్లు పొడిచేలా రోడ్లపై చెత్తలు దర్శనమిస్తున్నాయి. బల్లికురవ నుంచి కొణిదెన వెళుతుంటే అగ్రామ ఎంట్రన్స్‌లో రోడ్డు వెంబడి పెద్ద ఎత్తున వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. అలానే మార్టూరు వైపు నుంచి కొణిదెన వచ్చే రోడ్డులో ఎంట్రన్స్‌లో కూడా రోడ్డు వెంబడే వ్యర్థాలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఇలా అయితే గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా ఎలా ఉంటాయని బాటసారులు అంటున్నారు. అధికారులు నిత్యం ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. సమావేశాలో మాత్రం గ్రామాలలో ఎక్కడ రోడ్ల వెంబడి చెత్త కనబడకుండా చర్యలు చేపడుతున్నామని చెప్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ వేసిన చెత్త అక్కడ అన్నట్లుగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాలలో చెత్త సంపద కేంద్రాలు పనిచేయడం లేదని అందు వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని వారు అంటున్నారు. కొందరు చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాక రోడ్ల వెంబడ పడేసి పోతున్నారని అధికారులు వెంటనే స్పందించి కొణిదెన గ్రామానికి వచ్చే రెండు రోడ్లలలో ఉన్న చెత్తను తొలగించి పడకేసిన పారిశుధ్యాన్ని పరిశుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


బల్లికురవ - కొణిదెన గ్రామ రోడ్డులో ఉన్న వ్యర్థాలు


పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు

మణికేశ్వరం ఆలయాభివృద్ధి పనుల పరిశీలన

అద్దంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దేవదాయశాఖ ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈవో గుంటుపల్లి వాసుబాబు, అద్దంకి ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కరిముల్లా పాల్గొన్నారు.

తెలుగు యువత మండల అధ్యక్షుడు గోపి మృతి


గోపి (ఫైల్)

అద్దంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగు యువత అద్దంకి మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ గోపి (44) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. మండలంలోని ధేనువకొండకు చెందిన గోపీకృష్ణ మం త్రి రవికుమార్ అనుచరునిగా ఉన్నారు. దశాబ్దకాలంగా రాజకీయాలలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. వెన్నుపూస నొప్పితో బాధపడుతూ నాలుగు రోజుల కిందట గుంటూరులోని వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. సోమవారం డిశ్చార్జి అయి ఇంటికి రావల్సి ఉండగా సాయంత్రం 3-30 గంటల సమయంలో కొద్దిసేపు నడిచిన గోపి బెడ్ పై వాలిపోయాడు. వైద్యులు వచ్చి పరీక్షించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. గోపి మృతదేహాన్ని సోమవారం రాత్రికి ధేనువకొండకు తీసుకువచ్చారు. గోపికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గోపి మృతి తీరని లోటు : మంత్రి రవికుమార్

టీడీపీ నేత జొన్నలగడ్డ గోపి మృతి పార్టీకి తీరని లోటు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోపి మరణ వార్త విని దిగ్భ్రాంతికి లోనైట్లు తెలిపారు. గోపి కుటుంబసభ్యులకు రవికుమార్ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

టీడీపీ పట్టణపార్టీ అధ్యక్షునికి సతీవియోగం


శీలక్ష్మి(ఫైల్)

పర్చూరు, డిసెంబరు 23 : పర్చూరు తెలుగు దేశం పట్టణపార్టీ అధ్యక్షుడు, సీనియర్ నేత అగ్నిగుండాల వెంకటకృష్ణారావు సతీమణి అగ్నిగుండాల శ్రీలక్ష్మి(50) సోమవారం మృతి చెందారు. ఈమె తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక మహిళా నాయకురాలిగా పనిచేస్తున్నారు ప్రస్తుతం పంచాయతీ వార్డు మెండర్‌గా ఉన్నారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆదివారం పర్చూరులోని తన నివాసంలో మృతి చెందారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

శ్రీలక్ష్మి మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతికి గురయ్యారు. పార్టీ క్రియాశీలక మహిళా నాయకురాలిని కోల్పోయిందన్నారు. ఆమె భర్త వెంకట కృష్ణారావును ఆయన ఫోన్‌లో పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

మాజీ సర్పంచ్ గోవిందు మృతి


గోవిందు (ఫైల్)

బల్లికురవ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు మాజీ సర్పంచ్ రావులపల్లి గోవిందు(64) రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. శనివారం అద్దంకి నార్కెట్‌పల్లి రహదారి ఎస్ఎల్ గుడిపాడు గ్రామం వద్ద బైకుపై రోడ్డు దాటుతున్న గోవిందును కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతన్ని నర్సారావుపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన గోవిందు టీడీపీలో సీనియర్ నేతగా సుపరిచితులు. ఆయన మృతి వార్తను తెలుసుకున్న పలుగ్రామాల టీడీపీ నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు.

మూడు దుకాణాల్లో తనిఖీ

మార్టూరు,డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): మార్టూరు లో మూడు దుకాణాలను సోమవారం ఫుడ్ అధికారులు తనిఖీ చేశారు.వాటిలో ఒ క కిరాణా దుకాణానికి లైసెన్సు లేని కారణంగా సంబంధిత యజమానికి నోటీసును ఇచ్చినట్లు బాపట్ల ఫుడ్ అధికారి ప్రణీత్ కుమార్ తెలిపారు.

గంధ మహోత్సవాన్ని జయప్రదం చేయండి

చీరాలటౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుల మతాలకు అతీతంగా నిర్వహించే జాండ్రపేట అమీన్ పీర్ దర్గా 49వ గంధ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కమిటీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం దర్గా వద్ద సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. భక్తులు విశేషంగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జాండ్రపేట దర్గా ప్రతినిధులు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి


మహిళలకు చెక్కులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్, టీడీపీ నాయకులు

చినగంజాం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలను లక్షాధికారిని చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి అన్నారు. లఖపతి దీదీ కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంతరావూరు శాఖ ద్వారా 20 మంది డ్వాక్రా గ్రూపు సభ్యులకు రూ.20లక్షల చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి మహిళలకు ఆర్థికంగా నూతన ఉత్పత్తులను ఏర్పాటు చేసుకోవాలనే లక్ష్యంతో రుణాలను అందజేసినట్లు ఏపీఎం గద్దె సుబ్బారావు తెలిపారు. గ్రూపులో ఉన్న పది మంది సభ్యులకు సంవత్సరానికి ఒకరు చొప్పున 10 ఏళ్లలో పది మందికి ఇవ్వాలనే లక్ష్యంతో లఖపతి దీదీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రూపుల్లోని 20 మంది డ్వాక్రా మహిళలకు ఒకొక్కరికీ రూ.లక్ష చొప్పున రూ.20 లక్షల చెక్కులను బ్యాంకు మేనేజర్ అశ్వినీకుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జరుబుల సంధ్యారాణి అందజేశారు. కార్యక్రమంలో సీసీ మాధవి, వీవోఏ జయమని, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెచ్‌ఎం రామారావు

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

చినగంజాం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాలికలను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాల్‌లో ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీవో టి.ఝాన్సీ అధ్వర్యంలో కిశోర వికాసం అనే కార్యక్రమం ద్వారా బాలికల సంరక్షణపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో 11 మంది సభ్యులతో చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీడీపీవో టి.ఝాన్సీ తెలిపారు. బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోర వికాసం కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. బాలవివాహాలు, చైల్డ్ వర్సెస్ టీనేజ్ ప్రెగ్నెన్సీ, ఫోక్సో యాక్ట్, డ్రాప్స్ పిల్లల సైకాలజీ, పిల్లల యొక్క స్కిల్ డెవలప్‌మెంట్, న్యూట్రిషన్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం.కుర్రా రామారావు, పాఠశాల హెచ్‌ఎంలు, ఏఎన్ఎంలు, ఎమ్మెస్కేలు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గెలుపొందిన క్రీడాకారులతో కళాశాల ప్రతినిధులు

సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

చీరాల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు ఒంగోలు డీఏ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగాయి. ఆ పోటీలలో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల పాలిటెక్నిక్ విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్ పోటీలలో గెలుపొందారు. ఈ నేపథ్యంలో కళాశాలలో సోమవారం కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు రైతు సంఘం వినతి

మార్టూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెటింగ్ నేషనల్ పాలసీని ఉపసంహరించాలని, రైతు ఉద్యమాలను అణచివేసే చర్యల ను విడనాడి, సోమవారం మండల రైతు సంఘం నాయకులు తహసీల్దార్ టీ ప్రశాంతికి వినతిపత్రం అందచేశారు. ముందుగా వారు సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, ఎనికపాటి రాంబాబు, వీరవల్లి కృష్ణ మూర్తి,నాగబోయిన సాంబశివరావు, బి సూరిబాబు, మోహనరావు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి


రైతు రమేష్‌ను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ కడుపు నింపే రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రతి ఒ క్కరిపై ఉందని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించే గోవాడకు చెందిన నరిశెట్టి రమేష్‌ను ఘనంగా సన్మానించి, నూతన వస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ కార్యదర్శి చుండూరి మురళీసుధాకరరావు, అసిస్టెంట్ గవర్నర్ మహ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, అద్దంకి లేవి ప్రసాద్, డాక్టర్ దేవపాలన, పసుపులేటి ఆంజనేయులు, కాకర్ల వెంకటేశ్వర్లు, ఊటుకూరు రామకోటేశ్వరరావు, పువ్వాడ రామకోటేశ్వరరావు, గురుశేఖర్, అంజాద్ బాషా పాల్గొన్నారు.

మీ కుటుంబాలకు రక్షణ కవచం హెల్మెట్

అవగాహన ర్యాలీలో సీఐ శేషగిరిరావు



మార్టూరులో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐ శేషగిరిరావు, ఎస్ఐ సైదా తదితరులు

మార్టూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మా కోసం కాదు.. మీ కోసం మీ కుటుంబాల రక్షణ కోసం హెల్మెట్‌ను ధరించండి.. ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకోండని సీఎం ఎం.శేషగిరిరావు పిలుపునిచ్చారు. సోమవారం హెల్మెట్ వాడకం వల్ల కలిగే ఉపయోగాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సెంటరులో పోలీసు సిబ్బంది, హీరో షోరూం సిబ్బందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీఐ, ఎస్ సైదా పాల్గొని ఉత్తేజపరిచారు. అనంతరం సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకునేందుకు హెల్మెట్ ఒక్కటే దారి అన్నారు. హెల్మెట్ లేకుండా వెళ్లే వారిపి జరిమానా పెంచినట్లు చెప్పారు. ఇంటి యజమాని మృతిచెందితే ఏకంగా కుటుంబమంతా దిక్కులేనివాళ్లు అవుతారని అలా జరుగకుండా అందరూ విధిగా హెల్మెట్‌ను ధరించి సురక్షితమైన ప్రయాణం చేయాలని సీఐ శేషగిరిరావు సూచించారు. కార్యక్రమంలో హీరో షోరూం యజమాని కే శ్రీనివాసరాజు, యువకులు, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

అద్దంకి : ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించడం వల్లన ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని ఎస్సై ఖాదర్ బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని భవానీసెంటర్‌లో ద్విచక్రవాహనచోదకులకు హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. వాహనచోదకులతోపాటు వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించాలని సూచించారు.

చీరాలటౌన్ : నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలు దీనస్థితిలో ఉంటున్నాయని కావున ప్రమాదాలకు దూరంగా ఉండాలంటే హెల్మెట్ కచ్చితంగా ధరించాలని రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. సోమవారం ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలోని వీధుల్లో హెల్మెట్‌లు ధరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.